జనవరి - 2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**


A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole


IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్సనేహం | కొదవటికంటి | 03 |
| మహానటులు | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొదవటికంటి | 07 |
| ఎలీసబెతు | హన్నాకృప డెస్క్ | 09 |
| అలంకారము | హన్నాకృప డెస్క్ | 11 |
| సువార్తీకురాలు | సాక్ష్యం | 14 |
| వాగ్దానము | చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం | కొదవటికంటి | 18 |
| యెహోవా అందరికి... | హన్నాకృప డెస్క్ | 20 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 21 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |


సీరియల్ నంబరు



# సంపాదకీయం.....

హన్నాకృప పాఠకులకు కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

నూతన సంవత్సర పండుగకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచంలోని ఉన్న మతాలన్నిటికి వారికి సంబంధించి ఏదో ఒక పండుగ ఉంటుంది. హిందువులకి సంక్రాంతి, దసరా అని, ముస్లీంలకు రంజాన్ అని, క్రైస్తవులకి క్రిస్మస్ అని, ఇంకా ఇతర మతాల వారికి కూడా వారి వారి పండుగలు ఉంటాయి. అయితే ప్రపంచంలో అన్ని మతాల వారు, అన్ని దేశాల వారు సంయుక్తంగా చేసుకొనే పండుగే ఈ నూతన సంవత్సర పండుగ. ఈ నూతనము అనేది ఒక్క రోజుకి సంబంధించింది మాత్రమే, మరలా నూతన సంవత్సరము వచ్చే దాకా అంతా పాతగానే ఉంటుంది. మనుషుల్లో ఏ మాత్రం మార్పు రాదు. నిత్యము నూతనంగా ఎవరూ ఉండరు. అయితే ఎవరైతే క్రీస్తునందు ఉంటారో వారు మాత్రమే నిత్యము నూతనంగా ఉంటారు. “ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను” 2కొరింథీ.5:17. కాబట్టి మనం క్రీస్తులో లేనట్లయితే ఎన్ని నూతన సంవత్సర పండుగలు చేసుకున్నా మనలో నూతనత్వం ఏ మాత్రం ఉండదు. సంవత్సరాలు గడిచేకొద్ది క్రీస్తు రెండవ రాకడ సమీపమౌతుందని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి. క్రీస్తును ఎదుర్కొనేందుకు, ఆయనతో పరలోకరాజ్యమునకు వెళ్ళటానికి తగినంత విశ్వాసము సంపాదించుకోవాలి. ‘మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమి మీద విశ్వాసము కనుగొనునా?’ అని యేసుక్రీస్తు లూకా సువార్త 18:8లో స్వయంగా చెప్పియున్నాడు. అంటే అంత్యదినాలలో మనుష్యులందరూ ఈ లోకానికి బానిసలై దేవుని యందలి విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదం వుంది కాబట్టి ప్రతి ఒక్కరూ యేసుప్రభువు భూమి మీదకి వచ్చునప్పుడు ఆయన గుర్తించగలిగేటంత విశ్వాసము కలిగియున్నామో లేదో ప్రతిరోజూ తమ విశ్వాసాన్ని పరీక్షించుకోవాలి. ప్రభువు యొక్క కృప ఈ నూతన సంవత్సరంలో మీకు మీ కుటుంబాలకు తోడుగా వుండును గాక! ఆమేన్.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును. మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

సీరియల్

9

# జఫ్నత్పనేహు

(యోసేపు జీవితచరిత్ర)

– కొడవటికంటి

బాగా నిద్రట్టేసింది, చీకటి పడిన తర్వాత 'షాపులూ' అనే ఊరికి బయట వింటిమీద దూరంలో ఒంటెలన్నీ ఆగి పోయాయి. అక్కడ ఒక కాలువలాంటి చిన్న నది ఒడ్డున ఒంటెలను పడుకోబెట్టి ఏ ఒంటె మీదున్న బరువు మూటల ను అక్కడే విప్పదీశారు. బానిసలు ఈ కార్యక్రమమంతా అవలీలగా చేస్తుంటే ఆశ్చర్యమేసింది యోసేపుకు. తన తండ్రి ఇంటి వద్ద కూడా బానిసలు ఉన్నారు. కాని ఇంత త్వరగా పనులు చెయ్యరు. వీరు మరమనుషుల్లాగా కనిపించారు. కొంతమంది డేరాలు బిగిస్తున్నారు. ఆ ప్రాంతమంతా ఒక అరగంటలో ఒక ఊరులాగా అయిపోయింది. రెండు వీధుల్లాగా, ఒంటెలు, వాటి సామానులు వరుసగా క్రమంగా ఉంచారు. కొంత మంది గుడారాలలో రొట్టెలు కాలుస్తున్నారు. అయితే ఒంటెలకు మేతేమి లేదు. అరవై ఒంటెలను వరుసగా నడిపించుకుంటూ వెళ్ళి నది ఒడ్డున ఒంటెలకు నీళ్ల ఉన్నాయి. బానిసలు కొంతమంది ఈ ఒంటెల దేహా లను నీళ్ళతో కడుగుతున్నారు. తను ఎక్కి వచ్చిన ఒంటె సామాను మధ్యలో కూర్చున్నాడు యోసేపు. ఒక మూటకి ఆనుకొని కాళ్ళు చాపుకుంటే చాలా విశ్రాంతిగా అనిపిం చింది. తన ప్రక్కనే ఉన్న అతను ఒంటినిండా వస్త్రం కప్పుకున్నాడు. శరీరమంతా మండుతున్నట్లుంది. ఒంటెలు తిరిగి వస్తున్నాయి. అవి తిరిగి రాగానే వరుసగా పేర్చిన సామానులకి ఎదురుగా బారులు తీరి పండుకున్నాయి. గంట సేపు నీళ్ళు త్రాగిన ఈ ఒంటెలు రేపు మరలా గంటసేపు నీళ్ళు త్రాగగలవు. అయితే ఈ ఎడారిలో నాలుగైదు రోజులు ఆహారం లేకపోయినా నీళ్ళు లేకపోయినా తిరుగబడవు.

రాత్రి మొదటి జాము ముగిసే సమయంలో బానిసల లో ఒక యవ్వనస్తుడు రొట్టెలు, పాలు తెచ్చాడు. అప్పుడు అర్థమయింది యోసేపుకు – ఆడ ఒంటెలను ప్రయాణంలో ఎందుకు తెచ్చారో! రొట్టె రుచిగా ఉంది. తృప్తిగా తిన్నాడు. ఇప్పుడు మెదడు కొంచెం పనిచేయటం ప్రారంభించింది. దోతానులో ఉన్న తన అన్నలు తనను హింసించినప్పుడు మొదలైన వేదన, ఏడ్పు, శరీరగాయాలు – మెదడును మొద్దుబారేటట్లు చేశాయి. ఏ ఆలోచనా స్థిరంగా నిలువలేదు. ఆకలి అన్నిటికంటే ఎక్కువ బాధగా అనిపించింది. ఇంటి దగ్గర ఉన్నప్పుడు తనకు ఆకలి లేకపోయినా ఇష్టం లేకుండా నే ప్రతి పూటా భోజనం చెయ్యాల్సివచ్చేది. ఈ రోజు మొట్టమొదటిసారి బానిస భోజనం చేస్తున్నాడు. అంటే తన జీవితంలో – తను ఈ బానిసలలో తన ఇంటి వద్ద ఉన్న బానిసలలో ఒకడిగా అయిపోయాడు. ఈ ఒంటెలు ఎన్నడూ ఆహారం అడగవు. దప్పిక, ఆకలి తెలియజేయవు కానీ ఈ బరువులు మోస్తూ, గాండ్రిస్తూ నిరసనను నోటి మూల్గుల ద్వారా తెలియజేస్తూ, ముఖాలు పైకెత్తి నడుస్తుంటాయి. కాని ఈ బానిసల – కళ్ళలోనైనా కోపంగాని, విసుగుగాని కనబరిస్తే దాని పర్యవసానం వీపు భరించాల్సిందే!

ఒక నడికారు మనిషి కొంత గుగ్గిలం తెచ్చి గాయా లన్నిటికీ పూసి వెళ్ళాడు. తర్వాత తన కొరకు సామానుల గుడారంలో కొంచెం స్థలం శుభ్రం చేసి తీసుకొనివెళ్ళాడు. కాని మిగిలిన బానిసల కొరకు ఏ ఏర్పాటు చెయ్యలేదు. అందరూ ఎవరిష్టం వచ్చిన చోట వాళ్ళు పడుకున్నారు. రాత్రి జ్వరం వచ్చింది, అయినా బాగానే నిద్రపట్టింది. తెల్ల వారకుండానే ఎవరో లేపారు. చేతులమీద నుండి కాళ్ళకి వేసిన ఇనుప గొలుసులు బరువులేకపోయినా అసహ్యంగా ఉన్నాయి. అటు ఇటు కదిలేటప్పుడు వచ్చే శబ్దం వినలేనంత అసహ్యంగా ఉంది. పాలు తీసుకొని ఒకతను వచ్చాడు. ముఖం చూస్తే గిలాదు వానిలాగా ఉన్నాడు. తనకు చిన్నప్పు డు సిరియా భాషే మాతృభాష. కాని పద్దనరాము నుండి

బయలుదేరి ఇప్పటికి పన్నెండు సంవత్సరాలయింది. అందు వల్ల సిరియా భాష సరిగా మాట్లాడలేడు. మొత్తం మీద తన శరీరానికి గుగ్గిలం పూసిన యవ్వనస్తుని పలకరించాడు. సిరియా భాషతో పలకరించినందువల్ల అతనికి చాలా సంతోషం కలిగింది. అతని పేరు 'వియాన్' అని చెప్పాడు. ఈ సంకెళ్ళు ఇప్పట్లో తీయబడవని, 'కాకట్' అంటే ఐగుప్తు చేరటానికి రెండు మాసాలు పడుతుందని చెప్పాడు. ఎందుకంటే గాజా పట్టణంలో కొంత సరుకు అమ్మి, కొత్తసరుకు కొనాల్సి ఉందని, రెండ్రోజులు అలవాటైతే ఈ ప్రయాణం అంత కష్టం కాదని చెప్పాడు. వియాన్ బానిస కాదు – జీతగాడు. బానిసలకి చెవి కుడతారు. యేసేపు కూడా బానిసకాదు. 'కాకట్' లో యోసేపును ఎవరు కొనుక్కుంటారో వారి ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. తనను కొనుక్కునే యజమాని ఎవరో యోసేపుకు తెలీదు. యజమాని తనంతట తాను తెలియపరచకొనకుంటే తనకు ఎలా తెలుస్తుంది?

ఆ రోజంతా ఆ గుడారంలో అలాగే ఉన్నాడు. మంచి ఆహారం పెడుతున్నారు. సాయంకాలం నాలుగు గంటలకు వేయించిన మాంసం, పాలు తీసుకొని వచ్చాడు వియాన్. తను భోజనం చేస్తుంటే వియాన్ మాట్లాడుతున్నాడు. "రెండు మూడు రోజులు యజమాని నిన్ను గమనించిన తర్వాత నమ్మకం కలిగితే ఈ బంధకముల నుండి విముక్తి చేస్తాడు. అప్పుడు నువ్వు కూడా మాతో పాటు ఒంటెలను మేపటానికి రావచ్చు. ఈ ప్రయాణం అయితే, యొప్పే వద్ద సముద్రం ప్రక్కన ఒక వారంకాని పదిరోజులు కాని ఉంటాము. అక్కడ నుండి అంటే కుప్ర నుండి వచ్చే సరుకు కొంత, ఐగుప్తు తీసుకొని వెళ్ళవలసి ఉంది" అని చెప్పాడు. యొప్పే రేవు పట్టణం మీదుగా ప్రయాణం అని చెప్పగానే యోసేపు యొక్క ఆశలన్నీ ఒక్కసారి మాయమైపోయాయి. ఎందుకంటే ఈ మిద్యాను వర్తకులు గిల్గాలు నుండి బేత్షాను దగ్గర యోర్దాను దాటి గిల్బోవ పర్వతము చుట్టుకొని టీర్బాను రహదారిలో కలుసుకొని హఫెరు, అఫెకు, రబ్బా మీదుగా గెరారు వచ్చి, అక్కడనుండి ఐగుప్తు అంటే మెంఫిస్ వెళ్తే లాకీషు దగ్గర్లో ఉన్న తమ మందలకు దగ్గరగా వెళ్తాము కదా అని ఆశపడ్డాడు. తన తండ్రి కాపరుల సహాయంతో ఈ బంధకముల నుండి విముక్తి పొందవచ్చును అనుకున్నాడు. ఎన్నో ఆలోచనలు, వాటిలో కొంత ఆశాకిరణం కనిపించింది. ఇప్పుడు వారు యొప్పేకు వెళ్తున్నారంటే గాజా మీదుగా ప్రయాణం చేసి మెంఫిస్ వెళ్తారన్న మాట. ఈ విషయం తలచుకోగానే నిరాశతో ఏడుపు వచ్చింది. తనకు తెలియకుండానే కళ్ళవెంట నీరు కారిపోతుంది. నిట్టూర్పులు అణచుకోలేక పోవటం వియాన్ గమనించి దగ్గరికి వచ్చాడు. ఈ కొద్ది గంటల పరిచయం వియాన్‌కి ఎంతో స్నేహం కలిగించింది. సాధారణంగా ఈ మిద్యానీయుల వద్ద పనిచేసే వారికిగాని, బానిసలకు గాని – స్నేహం, ప్రేమలు అభివృద్ధి చెందవు. ఎందుకంటే వారు నిలకడలేని విధంగా కొద్దికాలం కలిసివుండి వేరైపోతారు. కాని వియాన్‌కి యోసేపుతో పరిచయం, పూర్వకాల అనుబంధం, రక్తసంబంధంలా అనిపించింది. అయినా ఏమని ఓదార్చగలడు? బయటకు వెళ్ళి కొంచెంసేపటికి వచ్చి గుగ్గిలం వీపు మీద, చేతులమీద వ్రాశాడు. రెండు రోజుల తర్వాత పెందలకడనే హడావిడిగా డేరాలు చుట్టేశారు. బానిసలు బరువులతో నిలుచున్నారు. యజమానులు అంబారీలు ఎక్కారు. బానిసలు నడుస్తున్నారు. యోసేపు మాత్రం ఇనుప సంకెళ్ళతో సామాను ఉన్న ఒంటె మీద కూర్చున్నాడు. ఇప్పుడు శరీరంలో ఏ గాయాలు లేవు అలసట, ఆకలి లేదు. తను కాకట్ చేరే నాటికి లావుగా, బలంగా నిగనిగలాడుతుంటే ధర ఎక్కువ పలుకుతుందని యజమాని ఆశ. అందువల్ల ఒంటె సవారి ఇచ్చాడు.

మధ్యాహ్నం సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చేటప్పటికి మొత్తం ఒంటెల వరుసలో నుండి ఒకే అడుగుల ధ్వని, భావరహిత మూలుగు, మధ్యమధ్యలో బానిసల అరుపులు! సూర్యుడు మధ్యధరా సముద్రం తట్టు ప్రయాణం కట్టాడు. గాతు రిమ్మోను ఇంకా ఒక కోసెడు దూరం ఉండగా భోజనం కోసం చెట్లక్రింద ఆగారు. సాయంకాలానికి యొప్పే చేరాలని వారి అభిప్రాయం. ఒంటెల బరువులతో నిలబడి యుండగానే ఒక అరగంటలో భోజనాలు ముగించి బయలు దేరారు. యొప్పే ఇంకా చాలాదూరం ఉంది. ఈ రాత్రి

రెండవ జాము మొదట్లోకాని చంద్రుడు కనబడడు. అప్పటికి యొప్పే పట్టణం చేరితే బాగుంటుందని అభిప్రాయం. యొప్పే పేరు చాలాసార్లు విన్నాడు. యొప్పే పట్టణం వ్యాపారస్తుల నోళ్ళలో నానుతుంటుంది. ఐగుప్తు నుండి ధాన్యం తెచ్చే పడవలకు – ఇదే రేవు. ఇటలీ నుండి, క్రేతు నుండి కూడా సరుకులు ఈ రేవుకు వస్తాయి. యొప్పే పట్టణం చాలా సంపన్నమైనది. ఉత్తరంలో తూరు సీదోనీయులు, సముద్రవర్తకములో మంచి కలప ఇక్కడకి తెస్తారు. అందు వలన ఈ పట్టణంలో బంగారం వర్తకుల మొదలు, తోళ్ళ పనివారి వరకు మంచి గిరాకీ ఉంది. ఈ పరిసరాలలో కొండలు ఎక్కువగా ఉండడం, షారోన్ పీఠభూమి ఉత్తర దిక్కున బహు సారవంతమైన భూమి అయివుండటం వలన ఈ రేవు పట్టణం సరుకుల ఎగుమతికి దిగుమతికి అంత వసతి లేకపోయినా వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. యోసేపు ప్రయాణం చేస్తున్న వర్తకుల గుంపు అక్కడకు చేరేటప్పటికి దాదాపు రాత్రి మొదటి జాము పూర్తి కావస్తుంది. యొప్పే పట్టణం రేవులోనికి చంద్రాకారంలో ఉంది. ఆ మధ్యలో ఉండే – దాదాపు నూట పదిహేను అడుగుల ఎత్తుగా నిట్టనిలువుగా ఉన్న కొండ రేవుకు బహువన్నె తెచ్చింది. రేవు ప్రాంతమంతా పెద్ద పెద్ద రాళ్ళతో ఉంటుంది. సముద్రం ఎప్పుడూ కోపంగానే ఉంటుంది. సముద్రపు అలలు ఎత్తుగా లేచి కొండరాళ్ళను ఢీకొంటాయి.

పాలస్తీనా దేశం అనే పేరు ఫిలిష్తీయ వలన వచ్చింది. పురాతన కాలంలో యుద్ధాలకు నిలయమైన కాకట్ దేశం తన నివాసులలో అనేకులను తూర్పువైపు పంపించింది. అక్కడ నుండి వచ్చిన కాందిశీకులు యొప్పే, గాజా పట్టణాల ను స్థాపించారు. యొప్పే పట్టణం తూరు, సీదోను, బబులో ను పట్టణాల కంటే పురాతనమైనది. ఆ రాత్రి యోసేపు బాగానే నిద్రపోయాడు. ఉదయం ఒంటెలను మేతకు తీసుకు వెళ్ళే సమయంలో వియాన్ చాలా సంతోషంతో యోసేపు దగ్గరకు వచ్చాడు. అతని వెంట సేవకులు ఎవరూ లేరు. రాగానే యోసేపు చెయ్యి ఓ చేతితో పట్టుకొని మరొక చేత్తో గొలుసులు పట్టుకొని "యజమాని నిన్ను రమ్మన్నాడు, భయపడకుండారా!" అని చెప్పాడు. యోసేపు గుండె కొంచెం గబగబా కొట్టుకుంటుంది. తన భవిష్యత్తు ఇప్పుడు నిర్ణయం కాబోతున్నది. లేచి నిలబడి వియాన్ వెనకాలే వస్తున్నాడు. ఇనుప గొలుసులు వేసే ప్రతి అడుగుకు తాళం వేస్తున్నాయి.

దేరా లోపల శుభ్రంగా ఉంది. యజమాని ప్రక్కనే వేరొక యజమాని కూర్చుని ఉన్నాడు. వారు ఏదో తింటూ మాట్లాడుకుంటున్నారు. యోసేపు రాగానే మాటలు ఆపి యోసేపును క్రింద నుండి పైదాకా పూర్తిగా పరీక్షగా చూశారు. యోసేపు వారిలో ఎవరి ముఖం కూడా సరిగా అంటే తర్వాత చూస్తే గుర్తుపట్టేంతగా చూడకుండానే తల వంచుకున్నాడు. సాధారణంగా వ్యాపారస్తులందరికీ, సిరియా భాష ఐగుప్తు భాష అలవాటై ఉంటుంది. బబులోను సామ్రాజ్యం హెచ్చుగా ఉన్నప్పుడు, ఈ దేశాలతో వ్యాపార కార్యక్రమాలు సాగించేది. అందువల్ల వ్యాపారస్తులకు సిరియా, ఐగుప్తు భాషలు వచ్చియుండాలి. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**

**చందా పంపించాలంటే**

**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra



# 'మహానటులు'



సినిమాల్లో, డ్రామాల్లో నటించే వారిని నటులు అంటారు కదా! బాగా నటిస్తే వాళ్ళకి ఆస్కార్ అవార్డు ఇస్తారు. సినిమా నటులు, సీరియల్ నటులు అంతా వృత్తిపరంగా నటిస్తుంటారు. అయితే జీవితంలో నటించే వారిని మహానటులు అనొచ్చు. వాళ్ళ హావభావాలు చూస్తే నటిస్తున్నారని అస్సలు అనిపించదు. క్రైస్తవులు కూడా మహానటులు అని, వాళ్ళకి ఇవ్వడానికి ఆస్కార్ కంటే పెద్ద అవార్డు లేకనే ఇవ్వలేకపోతున్నారని చెప్తే అతిశయోక్తి మాత్రం కాదు. క్రైస్తవులు అంటే క్రీస్తుని నమ్ముతున్నామని, క్రీస్తుని వెంబడిస్తున్నామని చెప్పేవాళ్ళు. క్రైస్తవులుగా పిలువబడుతూ, చర్చీకి వెళ్ళకుండా, బైబిలు చదవకుండా, ప్రార్ధన చేయకుండా, ఎలాంటి దేవుని పని చేయకుండా అన్యజనుల్లాగా జీవించే వారిని నామకార్ధ క్రైస్తవులు అంటారు. మరి చర్చీకి వెళ్తూ, ఎక్కడ సువార్త కూడికలు జరిగినా హాజరవుతూ, వీధి సువార్తలో పాల్గొంటూ, చర్చీ కమిటీల్లో పెద్ద పెద్ద పదవుల్లో ఉంటూ, ఇంకా చెప్పాలంటే సంఘకాపరులుగా, సువార్తికులుగా ఉంటూ అన్యజనుల్లా జీవించే వారిని ఏమనాలి? 'మహానటులు' అనే కదా పిలవాలి. యేసుప్రభువు 'వేషధారులారా' అని పిలిచింది ఇలాంటి వారినే. అన్యజనుల్లా ధనసంపాదనే ధ్యేయంగా జీవించే వాళ్ళని, భూమి మీద మీ కొరకు ధనము కూర్చుకొనవద్దు అని చెప్పినా కూడా బ్యాంకుల్లో కోట్లు కూడబెట్టుకుంటూ దేవుడు మమ్మల్ని అత్యధికంగా ఆశీర్వదించాడు అని చెప్పే వాళ్ళని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం సర్టిఫికేట్‌లో హిందూ అని పెట్టుకొనే వాళ్ళని, కోతెంతో విస్తారము కోతకు పనివారు లేరని తెలిసినా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసేవాళ్ళని, 'ఇదిగో దేవా నా జీవితం ఆపాద మస్తకం నీ కంకితం' అని పాటల్లోనే భక్తి ప్రదర్శించి ఈ లోకానికి వారి జీవితం అంకితం చేసే వాళ్ళని, పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వాళ్ళని 'క్రైస్తవులు' అని అంటారా? *'మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి' (అపో.కార్య. 11:26)* అని చెప్పబడినవారు క్రీస్తునందు చూపించిన భయభక్తులను బట్టి, క్రీస్తు కోసం అనుభవించిన శ్రమలనుబట్టి, ఆస్తులు అమ్మి క్రీస్తు సువార్త కోసం త్యాగం చేసిన దానినిబట్టి 'క్రైస్తవులు' అని పిలువబడ్డారు తప్ప ఊరికే క్రీస్తును నమ్మినందుకు కాదు. నేడు 'క్రైస్తవులు' అనబడే వారికి, క్రీస్తు పని చేస్తున్నామని చెప్పుకొనే సంఘకాపరులకి, సువార్తికులకి శ్రమలు ఉన్నాయా? దేవుని పని చేస్తున్నామని చెప్పుకొనే వారు పౌలు, పేతురు, ఇతర శిష్యులులాగా కష్టాలు, బాధలు, హింసలు అనుభవిస్తున్నవారు భూతద్దం పెట్టి వెతికినా మనకు కనబడతారా? ఎవరైనా తమ ఆస్తులు అమ్మి సువార్త కోసం ఖర్చు పెట్టే వాళ్ళున్నారా? సువార్త పేరు చెప్పుకొని కోట్లకు పడగలెత్తే వాళ్ళని మనం చూడటం లేదా? దేవున్ని అడ్డం పెట్టుకొని కోట్లు సంపాదిస్తూ దానికి 'దేవుని ఆశీర్వాదం' అని పేరు పెడుతున్నారు కదా! మరి ప్రపంచంలో ఉన్న అన్యజనులైన ధనవంతులకు కూడా దేవుడే ఇస్తున్నాడా? మీరు దేవునికిని, సిరికిని దాసులుగా ఉండనేరరు అని చెప్పి కోట్లు కోట్లు డబ్బు ఇస్తాడా దేవుడు? 'క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించే' క్రైస్తవుడు ఒక్కడైనా కనిపిస్తాడా మనకి. క్రైస్తవుడనే వేషధారణ ధరించి అన్యజనుల్లా జీవిస్తారు. *'అయ్యో, వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు సున్నము కొట్టిన సమాధులను పోలియున్నారు. అవి వెలుపల శృంగారముగా అగపడును గాని లోపల చచ్చినవారి యెముకలతోను సమస్త కల్మషముతోను నిండియున్నవి' (మత్తయి 23:27).* బయటకు క్రైస్తవుల్లా కనబడుతూ, లోపల అన్యజనుల కంటే ఘోరమైన జీవితం జీవించే వాళ్ళకి **'మహానటులు'** అనే బిరుదు ఇవ్వడం చాలా చిన్నదే. వీళ్ళ గురించి చెప్పుకోవాలంటే మనకి టైం సరిపోదులేండి.

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9440217726**

సీరియల్

3

# నా చిత్తానుసారుడు

– కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

వయస్సు పెరిగి వృద్ధుడైనా తన స్వంత పనులు తానే చేసుకోగలిగిన స్థితిలోనే ఉన్నాడు యెష్షయి. తన పదిమంది పిల్లలలో ఒకరి మీద అయినా ఆధారపడలేదు. దేవుడిచ్చిన ఆస్తి, పలుకుబడితో అందరి నోట్లో నాలుకలా ఉన్నాడు. బేత్లెహేమునకు పది మైళ్ళ దూరంలో గిబియాలో సౌలు రాజ్యం చేస్తున్నాడని విన్నాడు. సౌలును దర్శించటానికి వెళ్ళలేదు. ఉదయం ఇంకా జాము అయినా జరగక ముందే తన ఇంటి ఆవరణలో ఆగిన గుఱ్ఱాలను చూస్తూనే అవి రాజు దగ్గర నుండి వచ్చినట్లు అర్థమయింది. వారిలో పెద్దవాడు ముందుగా వచ్చి యెష్షయికి నమస్కారం చేసాడు. అందరిని సాదరంగా ఆహ్వానించి నడవలో ఉన్న ఆసనాల మీద కూర్చుండబెట్టాడు. ఊరి ప్రజలంతా ఈ విషయం విని బయట గుమిగూడారు. బెసలేలు తన చేతిలో ఉన్న పత్రమును యెష్షయికి ఇచ్చాడు. ఆయనకు చూపు మందగించినందున "మీరే చదవండి" అన్నాడు బెసలేలుకి ఇస్తూ. ఆయన చుట్ట విప్పదీసి "గొఱ్ఱెల యొద్దనున్న నీ కుమారుడైన దావీదును నా యొద్దకు పంపుము" అని చదివాడు. తర్వాత యెష్షయికి దగ్గరగా జరిగి సౌలు రాజునకు సంభవించినదంతా వివరించాడు. యెష్షయి లోనికి వెళ్ళి జరుగవలసిన కార్యక్రమము తన పెద్ద నౌకరుకు చెప్పాడు. ఒక పనివానిని గొఱ్ఱెల యొద్ద ఉన్న దావీదు కొరకు పంపించాడు. ఒక మేక పిల్లను వధించి వేయించారు. కొంతమంది రొట్టెలు చేయటం మొదలు పెట్టారు. పెద్ద తిత్తినిండా ద్రాక్షారసము పోసి నింపారు.

దావీదు ఇంటికి రాగానే తల అంటి దుస్తులు మార్చా రు. సమూయేలు అభిషేకించిన దానికి ఫలితం ఇదేనా అను కొన్నాడు యెష్షయి. గొఱ్ఱెల దొడ్డిలో నుండి బయటకు రప్పించ బడి రాజ మార్గాన ప్రయాణం చేస్తున్న తన తనయుని చూస్తే ఒకవైపు సంతోషం మరోవైపున విచారం కలిగాయి. తనను విడచి ఎన్నడూ ప్రయాణం చేయని తన కుమారుని తలచుకుంటూ మరలా తన కుమారుని ఎప్పుడు చూస్తానో అనుకున్నాడు. సాయంకాలం సూర్యాస్తమయ సమయమునకు ముందే బేత్లెహేము వెళ్ళిన సైనికులు ఇప్పుడు మరో రెండు గాడిదలను కలుపుకొని గిబియా పట్టణం సమీపించారు. విశాలమైన పూలవనములు, మండపమువలె కట్టబడిన స్థలములో సౌలు ఆసీనుడై ఉన్నాడు. బయట ప్రహరి యొద్దనే వాహనములు దిగి బెసలేలు ప్రక్కగా నడుస్తున్న ఆ యవ్వనుడు తన దగ్గరకు సమీపించే కొలది సౌలు ముఖం ప్రకాశమానమైనది. వయస్సుకు మించిన శరీరాకృతి, నడకలో బహు శూరత్వం, యుద్ధ చతురత కనిపించాయి. దగ్గరకు వచ్చి తలను వంచినప్పుడు ఉంగరాల వెంట్రుకల రంగు చూడ ముచ్చట వేసింది. కన్నార్పకుండా దావీదును చూస్తూనే ఉన్నాడు. "దావీదు" అను మాట సౌలు నోట నుండి వచ్చినప్పుడు చాలాకాలంగా పరిచయము కలిగిన స్నేహితుని చూచినట్లుగా సౌలు ముఖంలోనికి చూచాడు దావీదు. "సితారా?" అన్నాడు సౌలు. తనతో వచ్చిన సౌలు దాసులలో ఒకరివైపు చూచాడు దావీదు. వెంటనే ఆ దాసుడు దావీదు ప్రయాణము చేసిన కంచర గాడిద యొద్దకు వెళ్లి సితారా తీసుకొని వచ్చి దావీదు చేతికి ఇచ్చాడు. బెసలేలు వైపు చూచి, మరలా దావీదు వైపు చూసి "ఆయుధములు ఉపయోగించటం నేర్చుకొన్నావా?" అన్నాడు. "ఆయుధాలు నేను చెప్పినట్లుగా నడుచుకొంటాయి" అన్నాడు దావీదు. మాటనేర్పరియైన రూపసి అని అనుకొన్నాడు సౌలు. బెసలేలును దగ్గరికి పిలిచి వ్రాతపలక తెప్పించాడు.

"యెష్షయికి, దావీదు నా అనుగ్రహము పొందెను

గనుక అతడు నా సముఖమందు సేవ చేయుటకు ఒప్పుకొన వలయును. నీ కుమారుడు నా ఆయుధములు మోయువాడా యెను" అని వ్రాయించాడు సౌలు. బెసలేలు ఒక సైనికునికి ఆ ఉత్తరం ఇచ్చి బేత్లెహేము పంపాడు. సౌలు ఆసనము మీద నుండి లేచి బెసలేలు వైపు చూచి తన మందిరమువైపు నడక సాగించాడు. అది అర్థమైన బెసలేలు దావీదును వెంటబెట్టుకొని సౌలును అనుసరించాడు. కొన్ని సంవత్స రాల క్రితం ఎత్తుచేయబడిన కోట గోడల వెంబడి నడచి ఎడమ ప్రక్కకు తిరిగినప్పుడు అంతవరకు కనిపించని విశాలమైన అందమైన రాజప్రసాదము కనిపించింది. ఒలీవ చెట్లు బారులు తీరి ఉన్నాయి. మనుష్యులను చూచి భయ పడని నెమళ్ళు తిరుగుతున్నాయి. ఆ నెమళ్ళ వెనకాల ఏదో ప్రతిమ కనబడింది. ఆ ప్రతిమ ఆ నెమళ్ళ కంటే అందంగా కనిపించింది. ముదురు నారింజ రంగులో అస్తమిస్తున్న సూర్యకిరణాలు ఆ ప్రతిమ మీద పడినప్పుడు గాలికి తల వెంట్రుకలు ఎగిరి తనకు స్వాగతం పలుకుచున్నట్లు అనిపించి అప్పుడు అర్థమైంది ఆమె ప్రతిమ కాదు అందమైన ప్రాణి అని. ఆమె కన్నులు అలానే రెప్పవేయ కుండా దావీదును చూస్తున్నాయి. చెట్ల గుబురు దాటిన తరువాత సౌలు "రామ్మా" అన్నాడు. ఆ అమ్మాయి నడవలేదు, పరిగెత్తలేదు కాని తన తండ్రిని ఎలా చేరింది? అని అనుకొన్నాడు. ఆమె దావీదువైపు చూస్తూనే తండ్రి చేయి ఆప్యాయంగా పట్టుకొన్నది.

"బేత్లెహేమీయుడు దావీదు. ఇక ఇక్కడే ఉంటాడు" అని అన్నప్పుడు ఆమె తలత్రిప్పి నవ్వు ముఖంతో దావీదును చూసి వెంటనే తల మరల్చు కుంది. రాజకుమార్తెలందరూ ఇలా ఉంటారా? లేకపోతే రాజ ప్రాంగణానికి వన్నె తెచ్చేందుకు జన్మించిందా? అనుకున్నాడు. మీకాలు తండ్రి చెయ్యి పట్టుకొని నడుస్తూంటే సౌలు దావీదు వైపు చేయి చూపిస్తూ "చక్కగా సితారా వాయి స్తాడట" అన్నాడు. దావీదు ప్రక్కనే నడుస్తున్న బెసలేలు చిన్నగా "మీకాలు, రాజుగారి రెండవ కుమార్తె" అన్నాడు. ఈ పేరు ఇంతకు ముందు ఎవరూ పెట్టుకున్నట్లుగా లేదు. ఇటువంటి కన్య ఎక్కడా జన్మించి ఉండదు అనుకున్నాడు. రాజు ఎంత సౌందర్య వంతుడో ఆయన కుమార్తె అంతకు వందరెట్లు సౌందర్యవతి అనుకున్నాడు. తన చేతిలోని సితార పైకెత్తి చూచాడు. ఇంతకుముందు ఈ సితార అందమే తెలుసు. అందులో నుండి వచ్చే మధురరాగాలు తెలుసు కాని తన ముందు నడచి వెళ్తున్న ఈ 'సితారా' నడకలో కూడా మధుర కల్పన ఉంది అనుకున్నాడు. ఈనాడు ఈ గిబియాలో ఈ బెన్యామీనీయుల అమ్మాయిని చూసి ఎందుకిలా అయిపో తున్నాడు? ఇంత వయస్సు వచ్చినా తల్లి పెంచిన పెంపకంలో అందరూ సెరూయా, అబీగయీలు అక్కలాగ అనిపిస్తే, ఈ మార్పు ఏమిటి? అనుకున్నాడు.

సితార తీసుకొని విశాలమైన ఆ గదిలో ఎంత చల్లని గాలి ఈ చల్లదనం ఎలా వచ్చింది? సితార నిలబెట్టి చెవికి ఆనించి ఎడమ చేతితో తీగల మీద వ్రేళ్ళు మీటుతూ కండ్లు మూసికొని పాట మొదలు పెట్టాడు.

ఆహా గువ్వవలె నాకు రెక్కలుండిన యెడల
నేను ఎగిరిపోయి నెమ్మదిగా నుందునే
త్వరపడి దూరముగా పారిపోయి
పెనుగాలిని సుడిగాలిని తప్పించుకొని
అరణ్యములో నివశించియుందునే అనుకొంటిని.

ఈ పాట పాడుతుంటే అబీషై గుర్తుకు వచ్చాడు. ఇప్పుడు ఏమని అనుకొంటున్నాడో అనుకుంటూ.

అరణ్యములో నివశించి యుందునే అని రాగం తీస్తూ దేవా చెవి యొగ్గి నా ప్రార్థన ఆలకించుము. నా విన్నపమునకు విముఖుడవై యుండకుము. నా మనవి ఆలకించి నాకుత్తరమిమ్ము అని నిదానంగా సితార క్రిందకు దించాడు. తాను కళ్ళు తెరచేటప్పటికి, తండ్రి భుజం మీద చేయి వేసి ప్రక్కన నిలుచున్న మీకాలు నిలబడి వుంది. ప్రక్కనే అంతకంటే కొంచెం వయసున్న వేరొక కన్య వారి దగ్గరగా వుంది. వాళ్ళ అక్క కాబోలు? అనుకున్నాడు దావీదు. అయితే తన కుడిప్రక్కనే తను కూర్చున్న స్థలమునకు ఆనుకోని అందమైన యువకుడు.

**(సశేషం)**

స్త్రీల విభాగము

# ఎలీసబెతు

క్రొత్త నిబంధనలో మరియ తరువాత కనబడే స్త్రీలలో ఎలీసబెతు ఒకరు. ఎలీసబెతు గురించి బైబిల్లో అతి తక్కువ వ్రాయబడినప్పటికి ఆమె జీవితం నుండి మనం నేర్చుకో వలసిన అంశం ఖచ్చితంగా ఉండే ఉంటుంది. కాబట్టి ఎలీసబెతు గురించి ధ్యానించి దేవుడు మనకు నేర్పించే పాఠమేంటో తెలుసుకొందాం.

ఎలీసబెతు అహరోను కుమార్తెలలో ఒకరు అని వ్రాయబడింది. అంటే ఆమె లేవి గోత్రికురాలు. యాజకుల వంశీయురాలు కాబట్టి ఆమె బాల్యము నుండే దేవుని ధర్మశాస్త్రం గురించి, దేవుని పరిశుద్ధత గురించి విని ఉండవచ్చు. కాబట్టి దేవునియందు భయభక్తులు గలది అనవచ్చు. యాజకుడైన జెకర్యాతో వివాహం జరిగింది. వివాహం తరువాత కూడా ఆమె నిత్యము దేవునికి సేవ చేయు యాజక నేపథ్యం ఉన్న గృహములోకే ప్రవేశించింది. అంటే ఊహ తెలిసిన నాటినుండి దేవుని గురించి, ధర్మ శాస్త్రం గురించి, ఆయన న్యాయవిధుల గురించి వినని ఆలోచించని రోజు ఒక్కటి కూడ ఉండి ఉండదు. ఆమె కుటుంబ నేపథ్యము ఆమెను దేవుని గురించి ఆలోచించేలా, తెలుసుకునేలా చేసింది అనవచ్చు. దేవునితో ఉన్న ఈ వ్యక్తి గత సంబంధమే ఆమె ప్రత్యేకింపబడడానికి కారణమైంది.

"*వీరిద్దరు ప్రభువుయొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగా నడుచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతు లైయుండిరి" (లూకా 1:6).*

బైబిల్ గ్రంథములో నీతిమంతురాలు అని చెప్పబడిన అతి తక్కువ మంది స్త్రీలలో ఎలీసబెతు ఒకతె. ఈమె నీతిమంతురాలగుటకు కారణం దేవుని ఆజ్ఞలు, న్యాయ విధుల ప్రకారం నడుచుకొనడం అంటే జీవించడం. అంటే ఎలీసబెతు తన అనుదిన జీవితాన్ని దేవుని ఆజ్ఞలకు, న్యాయ విధులకు అనుగుణంగా మార్చుకుంది. అంటే అనుదిన జీవితంలో దేవుని ఆజ్ఞలను పాటించడం, తద్వారా దేవుని సంతోషపెట్టడం అంతేకాదు న్యాయవిధుల చొప్పున ప్రవర్తించినది అని వ్రాయబడింది అంటే దేవుని దృష్టికి న్యాయమైనదేదో అది చేయడం. ఒక వేళ అది మనుష్యులకు తోటి సమాజానికి వ్యతిరేకంగా ఉండి ఉండవచ్చు లేదా వారి దృష్టిలో తప్పుగా అనిపించి ఉండవచ్చు అయినప్పటికి వివేచన కలిగి దేవుని దృష్టికి యోగ్యమైనది న్యాయమైనది చేయుటయే దేవుని న్యాయవిధుల ప్రకారం నడుచుకొనుట. ఎలీసబెతు అటువంటి ప్రవర్తన కలిగి నిరపరాధురాలిగాను నీతిమంతురాలుగాను గుర్తించబడింది.

*"ధర్మశాస్త్రము వినువారు దేవుని దృష్టికి నీతిమంతులు కారుగాని ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించువారే నీతిమంతులుగా ఎంచబడుదురు" (రోమా 2:13)*

ఎలీసబెతు ధర్మశాస్త్రమును ఎరుగుటయే కాక దాని ప్రకారం అనునిత్యం ప్రవర్తించింది కాబట్టే దేవుని దృష్టికి నీతిమంతురాలైంది. క్రైస్తవ స్త్రీలమైన మనము దేవుని మాటల చొప్పున ప్రవర్తిస్తున్నామా? కొన్ని సంవత్సరాలుగా దేవున్ని ఎరిగి, రక్షణానుభవము కలిగినవారమైన మనము కేవలం వాక్యమును వినువారముగా ఉన్నామా? లేక వాక్యప్రకారం ప్రవర్తించువారముగా ఉన్నామా? అని ప్రతి ఒక్కరు వ్యక్తిగతముగా ఆలోచించాలి. కుటుంబంలో స్త్రీ జీవితం మిగిలిన కుటుంబ సభ్యులకు ఆచరణయోగ్యముగా ఉండాలి. అది కేవలం వాక్యానుసారమైన ప్రవర్తన కలిగి ఉండటం ద్వారానే సాధ్యం. *"మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునైయుండుడి" (యాకోబు 1:22)*

దేవుని ఆజ్ఞల చొప్పున ప్రవర్తించి, దేవుని దృష్టికి నీతుమంతురాలైన ఎలీసబెతు గొడ్రాలు. ఎంత ఆశ్చర్యమో కదా!. *"ఎలీసబెతు గొడ్రాలైనందున వారికి పిల్లలు*

*లేకపోయిరి" (లూకా 1:7).* దేవుని దృష్టిలో ఉన్న ఆమెకు దేవుడు గర్భఫలమును ఇవ్వలేదు. అది కూడ పెళ్ళైన ఒకటి రెండు లేదా పది సంవత్సరాల వరకు కాదు ముదిమి వచ్చు వరకు. *"వారు బహుకాలము గడచిన వృద్ధులైరి" (లూకా 1:7).* అంటే ఆమె ముసలితనము వచ్చు వరకు పిల్లలు లేనిదై ఉన్నది. ముసలితనం అంటే వివాహం అయినది మొదలుకొని దాదాపు 60, 70 సంవత్సరాల వరకు అనవచ్చు. ఎందుకంటే ఈ కాలంలో అయితే 60 సంవత్సరాలు పైబడిన వారిని ముసలివారు అంటారు. 2000 సంవత్సరాల క్రితం అంటే కనీసం ఎనభై, తొంభై సంవత్సరాల వారు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గలవారిని వృద్ధులుగా పరిగణిస్తారు అనవచ్చు. అంటే ఎలీసబెతు ఎంతో ఖచ్చితమైన, న్యాయమైన దేవుని దృష్టికి యోగ్యమైన జీవితాన్ని జీవిస్తూ 60 సంవత్సరాలు గొడ్రాలు అనే నిందను అనుభవించింది. వివాహమైన ప్రతి స్త్రీ తల్లి కావాలి అనుకుంటుంది. అటువంటిది ముసలితనం వచ్చేంత వరకు పిల్లలు కలగలేదు అంటే ఆమె మనసులో ఎంత కుమిలిపోయిందో, కన్నీటి ప్రార్థనలో ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపిందో. ఎంతగా విలపించిందో. తోటి స్త్రీలలో తనకు తాను తక్కువగా, ఎన్నికలేనిదిగా అనిపించి ఆత్మనూన్యత భావానికి గురై ఉండవచ్చు. ఎందుకంటే ధర్మశాస్త్రము బాగుగ తెలిసిన ఎలీసబెతుకు *"గర్భఫలము ఆయన (యెహోవా) ఇచ్చు బహుమానమే" (కీర్తన.127:3)* తెలుసు. అందరికి బహుమానమిచ్చే దేవుడు తనకెందుకు ఇవ్వలేదు? అని ఎన్నోసార్లు ప్రశ్నించుకొని ఉండవచ్చు అయితే దేవుని న్యాయ విధులు ఎరిగిన ఎలీసబెతు దేవుడు తప్పక న్యాయం చేస్తాడు అని తన్నుతాను ఓదార్చుకొని ఉండవచ్చు. కాని తన కుటుంబికులు, తన బంధువులు సమాజంలో తోటివారి ద్వారా ఎన్నో అవమానాలు సూటిపోటి మాటలు ఎదుర్కొని ఉండ వచ్చు. ఆమె భక్తి జీవితాన్ని కూడా పలురకాలుగా నిందించి ఉండవచ్చు. ఎంతో కృంగిపోయినను, కన్నీరు కార్చినను, బాధపడినను, నిరాశకు గురైనను దేవుని నిందించక ఆయన మీద అచంచలమైన విశ్వాసము కలిగి, తన భక్తిజీవితాన్ని కొనసాగించిన ఆదర్శవంతురాలు ఎలీసబెతు. ఇంచుమించు జీవితకాలమంతా ఎలీసబెతు నిందను అనుభవించింది. ఆమె జీవితంలో నిందలు, అవమానాలు ఉన్నప్పటికి ఆమె తన ప్రవర్తన ద్వారా దేవుని సంతోషపెట్టింది. తత్ఫలితంగా దేవుని అనుగ్రహం పొందుకుంది. ముసలితనమందు గర్భము ధరించింది. *"మనుష్యులలో నాకుండిన అవమానమును తీసివేయుటకు నన్ను కటాక్షించిన దినములలో ప్రభువు ఈలాగు (గర్భము ధరించుట) చేసెను" (లూకా 1:24.25).*

క్రైస్తవ స్త్రీలమైన మన జీవితాలలో ఎన్నో అవమానాలు ఇబ్బందులు ఉండవచ్చు వాటన్నిటికంటే దేవుని వాక్యప్రకారం ప్రవర్తించుటకు ప్రాముఖ్యతను ఇస్తున్నామా? లేక అన్యజనుల వలె మనకున్న ఇరుకులు ఇబ్బందులనుబట్టి చింతిస్తూ, దేవున్ని ఆశ్రయించక, ఇంకా చెప్పాలి అంటే దేవున్ని నమ్మక ఆయనను బాధపెట్టేవారముగా ఉన్నామా? ఎవరికి వారుగా ఆలోచించుకొని వారి వారి ప్రవర్తనను ఆలోచనా విధానాన్ని సరిచేసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఎలీసబెతు మనవంటి సాధారణమైన స్త్రీ. మనకున్నటు వంటి స్థితిగతులు ఇబ్బందులు ఇరుకులు ఆమెకు ఉన్నాయి, ఇంకా చెప్పాలి అంటే మనకంటే కఠినతరమైన సామాజిక పరిస్థితులలో ఆమె జీవించి దేవుని దృష్టిలో నీతిమంతురా లైంది. బైబిల్లో స్థానం సంపాదించింది. కొన్ని కోట్లమందికి ఆదర్శవంతురాలైంది. ఆమెకు ఉన్న ప్రత్యేకత ఆమె దేవుడు, దేవునిపై ఆమెకున్న అచంచలమైన విశ్వాసం. ఎలీసబెతుకు ఉన్న దేవుడు మనకు ఉన్నాడు. మరి నీ జీవితం కనీసం ఒకరిద్దరికైనా ఆదర్శప్రాయంగా ఉన్నాదా? ఆలోచించండి.

దేవుడు నమ్మదగినవాడు అని బైబిల్ ఆధారాలతో నొక్కి వక్కాణించుచున్నది. కాబట్టి మనం ఎటువంటి శ్రమల ద్వారా వెళ్ళవలసి వచ్చినప్పటికి ఆయనయందు నిరీక్షణగలవారమై ఆయన వాక్యప్రకారం జీవిస్తూ, ఆయన అనుగ్రహం పొందు వరకు ఓపికతో ప్రార్థనతో దేవునికి ఇష్టులుగా, ఆయన దృష్టిలో నీతిమంతులుగా ఉండుటకు ప్రయాసపడుదాం. *"ఆయన (యెహోవా) కనుదృష్టి న్యాయముగా చూచును" (కీర్తనలు 17:2).*

# అలంకారము

పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరం అనగానే ప్రతిఒక్కరు క్రొత్త ఉత్సాహంతో ఉంటారు. వీధులు, ఇల్లు, చర్చి ఎక్కడ చూసిన విద్యుత్ దీపాలతో అలకరణలు కనుల విందును చేస్తాయి. రాత్రిపూట ఆ దీపాల కాంతిని చూసి ఆనందించని వారుండరు. ఎంతో డబ్బును, సమయాన్ని వెచ్చించి రకరకాల ఆకారాల్లో డిజైన్స్‌లో చాలా అందంగా అలంకరిస్తారు. కేవలం వస్తువులనే కాక మను ష్యులు కూడ తమ్మును తాము విలువైన వస్త్రములతో బంగారు ఆభరణములతో అలంకరించుకుంటారు. ఆ అలంకరణ కొరకు ఎంతో ప్రయాస, ఎన్నో ప్రణాళికలు.

నేటి తరం వారైతే అందులోను ఆడవారైతే ఇంట ర్నెట్‌పై ఎంతో సమయాన్ని వెచ్చిస్తారు. రకరకాల హెయిర్ స్టైల్స్. జడ వేసుకోవడంలో కూడ స్టైల్ ఉంటుంది. మరలా ఆ జడను అలంకరించుకోడానికి రకరకాల వస్తు సామాగ్రి. తరువాత వస్త్రాలు. కొత్త కొత్త మోడల్స్, వెరైటీ కట్స్, కలర్స్, ఎన్నో. చీరలు కట్టేవారైతే బ్లౌజుకొక డిజైన్, క్రొత్త క్రొత్త నెక్ మోడల్స్, మగ్గం వర్క్, కంప్యూటర్‌వర్క్, ఇంకా ఎన్నో. ఆ తరువాత అలంకరణ సామాగ్రి. మేకప్ ఫౌండేషన్లు, పౌడర్లు, క్రీములు, లిప్‌స్టిక్స్, బాడీలోషన్స్, చెవులకు కమ్మలు లెక్కలేనన్ని డిజైన్స్, మెడలో హారము, చైనులు, మ్యాచింగ్ గాజులు, బ్రాస్‌లెట్స్, వాచ్‌లు వాటిలో రకాలు. చివరికి చెప్పులు. వీటిల్లోను హైహీల్స్ చెప్పులు, ఫ్లాట్స్ అని వంద రకాలు. ఇక మగవారి సంగతికి వస్తే వారికి కొత్త కొత్త స్టైల్స్ మార్కెట్‌లో ఉన్నాయి. ఇంత విస్తృతమైన పట్టీలేకపోయినప్పటికి, వారు షాంపూ, షేవింగ్ క్రీమ్‌లలో కూడ స్పెసిఫిక్‌గా ఉంటారు. బట్టలు, వాచ్, షూస్, గాగుల్స్ అన్ని బ్రాండెడ్ కావాలి అంటారు. ఇందులోను వందరకాల బ్రాండ్స్ ఉంటాయి.

సూచాయగా చెప్పడానికి ఇంత సమయం పట్టిందంటే నిజానికి ఎన్ని రకాలు ఉన్నాయో మనం ఊహించవచ్చు. అయితే అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే ఈ అలంకరణ అంతా దేనికి? ఇంత సమయం డబ్బు దేని కొరకు ఖర్చు పెడుతున్నాం? అని ఒక నిమిషం ఆలోచిస్తే కేవలం మనం సంతోషించడానికే. చర్చిని అలంకరించినా, మనల్ని మనం అలంకరించుకొని చర్చికి వెళ్ళిన అది కేవలం మనం కోసమే, ఈ అలంకరణలను దేవుడు పరిగ ణించడు, చూడడు. మనం మాత్రం దేవుని పేరు చెప్పుకొని, పండగ అనే పేరున మనల్ని మనం అలంకరించుకుంటాం. ఈ పనులన్నిటితో దేవునికి ఎటువంటి సంబంధం లేదు.

అలంకరించుకోవడానికి బైబిల్ విరుద్ధమా అంటే కాదు, దేవుని వాక్యం మనల్ని అలంకరించుకోమని ప్రోత్సహి స్తుంది. అయితే ఆ అలంకారము ప్రత్యేకమైనది.

*“జడలు అల్లుకొనుటయు, బంగారు నగలు పెట్టు కొనుటయు, వస్త్రములను ధరించుకొనుటయునను వెలుప టి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైన ట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభావము మీకు అలంకార ముగా ఉండవలెను. అది దేవుని దృష్టికి మిగుల విలువ గలది” (1పేతురు 3:3,4).*

దేవుని దృష్టిలో మిక్కిలి విలువగల అలంకారము ఉన్నది అని వాక్యం చెబుతుంది. మరి అటువంటి అలంకా రము ఎంతైనా కోరదగినది. ఆ అలంకారము మన అందరికి కనిపించే శరీరానికి కాదు. మన హృదయపు అంతరంగ స్వభావానికి. ఎందుకంటే *“మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు కాని యెహోవా హృదయమును లక్ష్య పెట్టును” (1సమూ. 16:7).*

అంతరంగ స్వభావమంటే బయటకు కనబడని మనం, మన మనస్సు. మనకు మాత్రమే తెలిసిన మనం. ప్రతి మనిషి మనసు ఒక రహస్యాల పుట్ట. మన ఆలోచనలే మన ప్రవర్తనకు కారణం. ప్రవర్తన బయటకు కనబడు తుంది కాబట్టి పదిమందికి అది అంగీకారయోగ్యంగా ఉండి ఉండవచ్చు కానీ ఆ ప్రవర్తన వెనక ఉన్న ఆలోచన ఆ వ్యక్తికి తప్ప ఎవరికి తెలియదు. కేవలం ఆలోచనే కాదు,

దాని వెనుక ఉన్న ఉద్దేశం కేవలం ఎవరి హృదయాలలో వారికే మాత్రమే తెలుస్తుంది. ఒక్కోసారి మన ఆలోచన వెనుక ఉన్న ఉద్దేశం మనకు కూడా పూర్తిగా తెలియక పోవచ్చు. ఒకవేళ తెలిసిన అది మనకు సరియైనదిగా అనిపిస్తుంది. కేవలం దేవుడు మాత్రమే మన ఆలోచన, ఆ ఆలోచన వెనుక ఉన్న ఉద్దేశ్యం యొక్క నిజ స్వరూపం చూడగలడు. కాబట్టి దేవుడు మనుషులలో చూసే ఆ హృదయపు అంతరంగ స్వభావాన్ని అలంకరించమంటున్నాడు. వేటితో అలంకరించమంటున్నాడు అంటే సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణముతో అలంకరించాలి. మన హృదయపు అంతరంగ స్వభావము సాధువుగాను మృదువుగాను ఉండాలని అర్థము.

**సాధువైన హృదయపు అంతరంగ స్వభావము:** హృదయం యొక్క అంతరంగం (మనసు) సాధువైనదిగా ఉండాలి. మనస్సును సాధు చేయాలి లేదా నియంత్రించాలి అని అర్థం. అంటే శాంతియుతమైన నిర్మలమైన మనస్సాక్షి కలిగి ఉండాలి. ప్రతి ఒక్కరికి మంచి చెడు తెలుసు కానీ చెడు చేయకుండ ఉండలేక, మనస్సును నియంత్రించుకోలేక పాపాలు చేస్తారు. చిన్న చిన్న విషయాలలో (ఉదా: తిండి, సినిమాలు, అబద్ధాలు, కోపము) కూడ మనస్సును నియంత్రించలేము. ఎప్పుడైతే మనస్సును నియంత్రించలేమో చేయకూడదని మనం అనుకునే పని చేసేస్తాం. ఆ పని చేసినంతసేపు దానిని ఆనందంగా అనుభవించినా, ఆ తరువాత పాపం చేశామనే భావన మనలను ప్రశాంతంగా ఉండనివ్వదు. దేవుని యొద్దకు ప్రశాంతంగా వెళ్ళలేము. మనస్సాక్షి యొక్క దోషారోపణ మనల్ని దేవునికి దూరం చేస్తుంది. *"పరాక్రమశాలికంటే దీర్ఘ శాంతముగలవాడు శ్రేష్ఠుడు. పట్టణము పట్టుకొను వానికంటే తన మనస్సును స్వాధీనపరచుకొనువాడు శ్రేష్ఠుడు" (సామెతలు 16:32).* మనస్సును నియంత్రించగలిగితే సాధువైన స్వభావం (దీర్ఘశాంతము) కలిగియుంటాము. ఎప్పుడైతే మనస్సులో ఎటువంటి గలిబిలి ఉండదో అప్పుడు నిర్మలమైన మనస్సాక్షి కలిగి సాధువైన గుణము కలిగి ఉంటాము.

**మృదువైనటువంటి అంతరంగ స్వభావము :** అవసరతలో ఉన్నవారిని చూచి మన హృదయం స్పందించే తీరునుబట్టి మన హృదయ అంతరంగ స్వభావమును చెప్పవచ్చు. కష్టాలలో ఉన్న వారిని కొంత మంది మాటలతో ఆదరిస్తారు. కొందరు సహాయం చేసి ఆదరిస్తారు. కొందరు ఆ రెంటితోపాటు కష్టాలు తీరే మార్గం చూపుతారు. ఇంకొందరు కేవలం మార్గం చూపడమేకాక ఆ మార్గంలో వారు నడుచుటకు సహాయ పడతారు. ఇతరులపట్ల బాధ్యతాయుతంగా ఉండటం అనవచ్చు. తోటి వారికి మనం చూపవలసిన ప్రేమ, జాలి, దయవంటి లక్షణాల తీవ్రతనుబట్టి మన హృదయ అంతరంగ స్వభావం యొక్క మృదుత్వం ఆధారపడి ఉంటుంది. ఇతరులతో మన ప్రవర్తన అన్ని విధాల ఆమోదయోగ్యంగా ఉండాలి.

*"దయను సత్యమును ఎన్నడును నిన్ను విడిచి పోనియ్యకుము వాటిని కంఠ భూషణముగా ధరించుకొనుము" (సామెతలు 3:3).*

కంఠభూషణమంటే హారము. ఈ హారం బంగారుతో కాక దయ, సత్యము అను విలువైన రాళ్ళతో పొదగబడినది. విలువైనది కాబట్టి అంత సులువుగా దొరకదు. దాని కొరకు శ్రమించాలి. కొంత వెల (సమయము, ధనము, అపవాదులు భరించడం, నిందలు...) చెల్లించాల్సి ఉంటుంది. పైగా వాటిని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలట. లేకుంటే అవి విడిచిపోతాయని వాక్యం సెలవిస్తుంది. జాగ్రత్తగా కాపాడుకోవడం అంటే మన శరీరం ఇతరుల పట్ల విరోధంగానే పనిచేస్తుంది. అనేక సందర్భాలలో ఎవరైనా ఇబ్బందులలో ఉంటే మనకెందుకులే లేనిపోని తలనొప్పి అనుకొని ప్రక్కగా వెళ్ళిపోతుంటాం. అలా అనిపించినా సరే ఆ ఆలోచనను అధిగమించి దయ చూపించగలగాలి. కష్టమైన నష్టమైన నిజం చెప్పగలగాలి. నిజం చెప్తే అనేక ఇబ్బందులు కలుగుతాయి అయినా సరే ఇబ్బందులు, వెక్కిరింతలు ఉన్నా వాటిని ముందుగానే ఊహించి ఎదుర్కొనుటకు సిద్ధపడి సత్యమును పలకాలి. అప్పుడు మాత్రమే దయ, సత్యము ఎల్లప్పుడు మనతో ఉంటాయి. మన అంతరంగ స్వభావ అలంకరణ దేవుని దృష్టిలో విలువగలది అవుతుంది.

ఈ రెండు గుణాలను కలిగియుండటం యేసుప్రభువు చెప్పిన రెండు ప్రధానమైన ఆజ్ఞలను పూర్తిస్థాయిలో పాటించడమే. ఎప్పుడైతే మనస్సును నియంత్రించగలమో సాధువైన అంతరగ స్వభావము కలిగి ఉంటాము. అప్పుడు మనస్సు

లోకాశల మీద కాక దేవునిమీద లగ్నమౌతుంది. "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణమనస్సు తోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను" అనే ఆజ్ఞను పాటించగలము. మృదువైన హృదయపు అంతరంగ స్వభావం కలిగి ఉంటే 'నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించుము' అనే ఆజ్ఞను నెరవేర్చినవారమౌతాము.

అయితే ఈ రెండు గుణాలు కలిగి ఉండటమంటే అదేమంత సులభతరమైనది కాదని గ్రహించాలి. అయితే అసాధ్యం కాదని యేసుప్రభువు రుజువు చేశాడు. కాబట్టి యేసువలె మనం ఉండగలిగితే మన హృదయ అంతరంగ స్వభావమును అక్షయమైన అలంకారముతో అలంకరించుకో వచ్చును. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరూ క్రీస్తును ధరించుకొనియున్నారు" (గలతీ.3:27). క్రీస్తును కలిగిన మనం మన హృదయ అంతరంగ స్వభావమును దేవుని దృష్టికి విలువైన అక్షయాలంకారముతో అలంకరించుకొనుటకు ప్రయత్నిద్దాం. ప్రయాసపడుదాం.

## చందాదారుల వివరములు

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపో. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole
**A/c No. 10957294340**

## పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక-5 జవాబులు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 యే | 2 సు | క్రీ | స్తు | 3 ఎ | | 4 మూ | 5 బం |
| | 6 వ | ద్రం | గి | 7 లీ | హే | డు | గా |
| 8 భ | ర్త | | 9 కై | స | రు | | ర |
| 10 డు | మా | 11 దూ | త | 12 బె | త్లె | 13 హే | ము |
| క్తు | 14 న | జ | రే | తు | | 15 రో | మా |
| షి | 16 ము | ళ | బో | 17 దా | వీ | దు | |
| భి | | 18 ప | శు | వు | ల | పా | 19 క |
| 20 అ | న్న | | 21 మ | రి | య | | ల |

### పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక –3
### సరైన జవాబులు పంపించిన వారు

1. శ్రీమతి సంధ్యారాణి, ఒంగోలు
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
4. టి. సుదర్శన్, నంద్యాల
5. కె. లలితాబాయి, వైజాగ్
6. యం. భాగ్యవతి, వరంగల్
7. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం



సాక్ష్యము

# సువార్తికురాలు

నా పేరు పద్మ. నాతండ్రి పేరు బాగయ్య, తల్లి బాగమ్మ. మెదక్ జిల్లా జోగిపేట వద్ద నాగులపల్లె అనే చిన్న కుగ్రామం. మా గ్రామములో బడి లేదు. చర్చిలేదు. ఒకే ఒక క్రైస్తవ కుటుంబము ఉండేది. యేసు అనే పేరు కూడ అక్కడ వినబడలేదు. మేము నలుగురు సంతానము. ఇద్దరు ఆడపిల్లలలో ఇంటికి పెద్దబిడ్డను. సరియైన వృత్తిలేక మా తండ్రి కుటుంబమును పోషించలేకపోయినందున మేము కఠిక దారిద్రము అనుభవించాము. చదువు అసలే లేదు. హైదరాబాదులో మా మేనమామ ఉన్నాడు. ఎప్పుడైనా వారి ఇంటికి వెళ్తే కూరఅన్నం తినేవాళ్ళము. మిగిలిన రోజులన్నీ పచ్చళ్లే. మా మామ మాకు అన్నం పెట్టగలడే కాని మా భవిష్యత్తు దిద్దలేడు కదా. ఎవరూ చూసేవాళ్లు లేరు. మా అమ్మ నలుగురు పిల్లలను తీసికొని హైదరాబాదు శివార్లలో చిన్న ఇంటిలో కాపురము పెట్టి ఆమె కూలికి వెళ్ళేది. అప్పుడు నా వయస్సు 7 సంవత్సరములు పది సంవత్సరాలు వచ్చిన తర్వాత నేను కూడ మా అమ్మతో వెళ్ళే దానను.

నాకు పదమూడు సం॥ల వయస్సులో మా యింటి ప్రక్కన ఒక క్రైస్తవ కుటుంబములోని ఆంటీ – నువ్వు ఆఫీసులో పని చేస్తావా? అని అడిగింది. నాకు చదువు లేదు కదా అన్నాను. నువ్వు చదువుకొనిన అమ్మాయి లాగానే కనిపిస్తావు. ఫోను దగ్గర కూర్చునే పని ఉంది. ప్రక్కన నేనుంటానుగా అన్నది. నేను ఆ ఉద్యోగములో చేరాను. ఫోనులో – ఆ ఆంటీ చెప్పిన మాటలు తప్పితే ఇంక ఏమి వేరే మాటలు చెప్పనవసరము లేనందున ఉద్యోగం బాగానే ఉండినది. ఫోనులో మాట్లాడటం నేర్చుకొన్నాను. ఎవరైనా మనుషులు వస్తే మాట్లాడలేకపోయాను. మగవారిని చూస్తే చాలు భయం వేసేది. 6 నెలలు గడిచిన తర్వాత కొంచెం స్థిమిత పడ్డాను. 'అరోరా పౌల్ట్రీ ప్రొడక్ట్సు' అనే కంపెనీ యజమాని డానియెల్ పిళ్లైగారు నేను పనిచేసే చోటకు వచ్చేవారు. ఆయన నాతో మంచిగా మాట్లాడేవారు. స్నేహ పూరితంగా ఉండేవారు. ఆయన లక్షలలో వ్యాపారం చేస్తున్న ప్పటికి చాలా మర్యాదగాను ఆదరణగాను పలుకరించేవారు. ఎవరైనా బీద అమ్మాయిని, ఎక్కువ చదువుకొని అమ్మాయిని వివాహం చేసికోవాలనే తలంపుతో ఉన్నట్లుగా ఆయన నాకు చెప్పారు. ఈ కొద్ది నెలల పరిచయములోనే నన్ను వివాహమాడవలెనన్న తలంపుతో ఉండి నా ఇంటి విషయాలు, పరిస్థితి, మంచిచెడ్డలన్ని తెలుసుకొని నన్ను వివాహం చేసికొన్నారు. ఆయన క్రైస్తవుడే కాని క్రీస్తు ప్రభువుతో సహవాసము లేనివాడు. గర్భవతి నయ్యాను. కాని మూడవ నెలలో అబార్షన్ అయింది. తర్వాత ఎంత కాలానికి గర్భవతిని కాలేదు. నాకు ఎంతో విచారము కలిగేది. నాభర్త తన గదిలో మోకరించి ప్రార్థన చేసికొనేవాడు. నేను మాత్రం అనేక విగ్రహములకు సంతానము కొరకు పూజలు చేసాను. ఎన్నో నోములు చేసాను. చాలా కాలం నుండి నా కొక క్రైస్తవ స్నేహితురాలు ఉన్నది. మేమిద్దరము లోకసంబంధము గానే జీవించేవారము. ఒకసారి వారి స్వస్థలము ఒంగోలు వచ్చాము. వారి బంధువులు భోజనానికి ఆహ్వానించారు. ప్రార్థన చేస్తున్నప్పుడు నేను కండ్లు తెరిచే ఉండేదానను. ప్రార్థన అయిపోయి ఆమెన్ అనేటప్పుడు కండ్లు గట్టిగా చాలాసేపు మూసి ఉంచేదానను. నేనెక్కువ భక్తి గల దానిని అనుకొనేవారు. పెద్ద బొట్టు పెట్టుకొనేదానను. ఆ బొట్టు వెనుక నా హృదయం ఎంతో చీకట్లో ఉండినది. నా ఫ్రెండు నాన్న నా ఫోటో తీసికొని నీకొరకు ప్రార్థిస్తాను అన్నాడు. ప్రార్థన అంటే ఏమిటో ఎలా చేయాలో ఎవరికి చేయాలో నాకు తెలియందు నా కొరకు ఎందుకు ప్రార్థన చేస్తారు. ఏమని ప్రార్థన చేస్తారో అని అనుకొన్నాను. రక్షణ అంటే నాకు తెలియదు. బిడ్డల కొరకైన నా కోరిక అలానే ఉంది. ఒక రోజు మేమున్న అపార్టు మెంటుకు 'విరల్' అనే సువార్త సేవకుడు వచ్చాడు. నాకు యేసు ప్రభువును గురించిన

సువార్త చెప్పాడు. ఆ విధముగా 3 సంవత్సరములు అప్పుడప్పుడు వచ్చి వాక్యము చెప్పి ప్రార్థించి వెళుతుండేవాడు. అయినా నేను విగ్రహారాధనలోనే ఉన్నాను. నా పెనిమిటి తన గదిలో ప్రార్థన చేసుకొనేవాడు. ఒక రోజు 'విఠల్' పాష్టరు రక్షణ విషయమై వాక్యము చెప్పి వెళ్ళిపోయిన తరువాత నా హృదయంలో యేసు ప్రభువును గురించి ఆయన శిలువను గూర్చి ఆయన ఇచ్చే రక్షణ గురించి కదలిక మొదలయింది. నా పెనిమిటి ప్రార్థించే గదిలోనికి వెళ్ళి ఆయన మోకరించినట్లుగా మోకరించి తండ్రి కుమార పరిశుద్ధాత్మ అని మనుసులో అనుకొన్నాను. ఇంకా ఏమి ప్రార్థన చేసేనో నాకు తెలియదు. ఆ రోజు నుండి రోజు యేసు ప్రభువుకు మోకరించి ప్రార్థించాను.

45 రోజుల తర్వాత హాస్పటల్‌కి వెళ్తే నేను గర్భవతినని చెప్పారు. నాకు తెలియని ప్రార్థన నేను చేస్తే నా ప్రార్థన విని నన్ను కరుణించిన యేసు మీద నాకు భక్తి కలిగింది. నాకు చదువు లేదు. కాని నేను వినినది ఇతరులకు చెప్పగల శక్తి నాకు ప్రభువు ఇచ్చాడు. అందువలన అందరికి నా సాక్షము చెప్పటము ఆరంభించాను. నా గదిలోని విగ్రహాలన్నీ పడవేశాను. దేవునిలో ఎదగటం ప్రారంభించాను. నా భర్త క్రైస్తవుడయినా ఏరోజు యేసును గురించి నాకు చెప్పలేదు. ప్రభువే నాకు ప్రార్థన చేయడం నేర్పించాడు. అ..ఆ...లు కూడా రాని నాకు బైబిలు చదవటం నేర్పించాడు. చివరికి వంట చెయ్యడం కూడ నేర్పించాడు. నాకు ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత ఎన్నో శోధనలు వచ్చాయి. అన్నిటిలో ప్రభువు నన్ను ఆదుకొన్నాడు. నా భర్త సి.యస్.ఐ. చర్చీ సంబంధి అయినందున చిలకరింపు బాప్తిస్మము తీసికొన్నాడు. 2000 సంవత్సరంలో మీటింగులకు కుటుంబముతో వెళ్తుండేవారము. 2001 డిశెంబరు 4న ఇద్దరం కలిసి బాప్తిస్మము తీసుకోవాలని అనుకొన్నాను.

మేము హిమయత్ నగర్‌లో కాపురమున్నాను. సాయంకాలం 4గంటలకు నాకు ఫోన్ వచ్చింది. మా ఆయన మారుతి కారు లకిడీకపూల్ లోని అశోకా హోటల్ వద్ద యాక్సిడెంట్ అయింది. కారు గుల్ల అయింది అని చెప్పారు. నేను వెంటనే లేచి గదిలోనికి వెళ్లి మోకాళ్ళ మీద ఒరిగాను. ప్రభువా నా పెనిమిటికి ఏ అపాయము లేకుండా చేయి – ఇక మే మిద్దరము నీకు సాక్షులముగా నీ సేవ చేస్తామన్నాను. – పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి హాస్పటిల్‌కి వెళ్ళాను. నా భర్త వస్త్రములన్నీ రక్తంతో తడిచి ఉన్నాయి. కాని మోకాళ్ల మీద 3కుట్లు పడే దెబ్బమాత్రం తగిలింది. ఎటువంటి అపాయం లేకుండా ప్రభువే కాపాడాడు. డిశంబర్ 12 నాటికి మేమంతా మా చిన్న పాప పుట్టుక దిన వేడుక సంతోషముగా కన్నీళ్ళతో ప్రభువుకు కృతజ్ఞతా స్థుతులతో జరుపుకున్నాము. డిశెంబర్ 30న నారాయణ గూడ బాప్టిస్టు చర్చిలో మేము బాప్తీస్మం తీసుకొన్నాము. నాఇంటిలో ప్రభువు చేసిన అద్భుత కార్యములు ఎన్నో – ఎన్నో ఉన్నవి. పూర్వం సంవత్సరమెల్లా బిజినెస్‌లో మునిగి పోయి వుండే నా పెనిమిటి ఇప్పుడు వ్యాపారం ప్రభువు చేతిలో పెట్టి మాకు ఎక్కడ నుంచైనా సరే సువార్త సేవకై ఆహ్వానము రాగానే మా సొంత ఖర్చులతో వెళ్ళి వాక్యము ప్రకటించి వస్తున్నాము. వ్యాపారం కాపాడేవాడు ప్రభువే – అది లక్షలతో చేసే వ్యాపారమైనా భయపడనవసరం లేదని అభిప్రాయం – ప్రభువు కొరకు మనము ఏమిస్తామో అది నూరంతలుగా మన ఒడిలో అణచి కుదిలించి దిగజారునట్లుగా ప్రభువు మనకు అనుగ్రహిస్తాడు. డబ్బుతో కొనలేని సంతోష సమాధానములు యేసు సేవలో మేము పొందియున్నాము.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలిభాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

చిన్నపిల్లల పేజి

# వాగ్దానము

మూడవ తరగతి చదువుతున్న ప్రవీణ్, జోసఫ్‌లు మంచి స్నేహితులు. ప్రతిరోజు కలిసి లంచ్ చేసేవారు, సంతోషంగా ఆడుకునేవారు. 'ప్రతిరోజు కంటే ఈ రోజు ఎక్కువ సమయం ఆడుకుందాం రేపు న్యూ ఇయర్ స్కూల్ సెలవు కదా' అన్నాడు ప్రవీణ్. 'న్యూఇయర్ హ్యాపీ డే. కొత్తబట్టలు, కేక్స్, బిర్యాని అన్ని ఉంటాయి' అన్నాడు జోసఫ్ సంతోషంగా.

న్యూ ఇయర్ రోజు జోసఫ్ తలిదండ్రులతో కలిసి చర్చ్‌కి వెళ్ళాడు. చర్చిలో వాగ్దానాలు తీసుకొని ఆరాధన ముగించు కొని ఇంటికి వచ్చాక 'మమ్మీ నా వాగ్దానం ఏంటి? నాకు నేర్పించవా?' అని అడిగాడు జోసఫ్ తల్లిని. తప్పకుండా అంటూ జోసఫ్ వాగ్దానం తీసి ఇలా చదివింది తల్లి. 'మీకేది ఇష్టమో *అడుగుడి. అది మీకు అనుగ్రహింపబడును' (యోహాను 15:7)* 'అనుగ్ర... అనుగ్రహించడం అంటే ఏంటి మమ్మీ?' అడిగాడు జోసఫ్ తడబడుతూ. 'అనుగ్రహించడం అంటే ఇవ్వడం. నీకేది ఇష్టమో దేవున్ని అడిగితే దేవుడు ఇస్తాను అంటున్నాడు' అని చెప్పి కిచెన్‌లోకి వెళ్ళింది తల్లి. తన వాగ్దానము విన్న జోసఫ్‌కి ఎక్కడ లేని సంతోషం కలిగింది. వెంటనే దేవున్ని తన ఫేవరెట్ ఫైర్‌ఫాక్స్ సైకిల్ అడగాలి అని ఆలోచన వచ్చింది. బ్రాండెడ్ సైకిల్ అంటే ఖరీదెక్కువ. ఉన్న సైకిల్‌ని వాడుకో అది కూడ కొత్తదేగా అన్న డాడీ మాటలు గుర్తుకువచ్చాయి. వెంటనే పరిగెత్తు కుంటు తల్లి వద్దకు వెళ్ళి 'మమ్మీ, మమ్మీ మన దగ్గర డబ్బులు లేకపోయినా దేవున్ని అడిగితే ఇస్తాడా?' అన్నాడు అమాయకంగా. జోసఫ్ ప్రశ్నకు ముచ్చట వేసి ఖచ్చితంగా 'ఇస్తాడు, అయితే దేవుడు ఇచ్చే వరకు ఓపికగా ప్రార్థించాలి' అన్నది తల్లి. 'ఓకే మమ్మీ ఈ రోజు నుండి డైలీ పార్థిస్తాను' అన్నాడు జోసఫ్. 'నిజంగానా, ప్రామిస్?' అంది తల్లి. 'ప్రామిస్ రోజు ప్రేయర్ చేస్తాను' అని తన రూంలోకి పరిగెత్తాడు జోసఫ్. ఆ రోజు నుండి జోసఫ్ ప్రతిదినము వాగ్దానమును గుర్తు చేసుకొని సైకిల్ కొరకు ప్రార్థించసాగాడు.

ఒకరోజు ప్రవీణ్, 'సాయంత్రం పార్కులో ఆడుకుందామా? అక్కడైతే జారుడు బల్ల, స్పిన్నర్స్, క్లైంబర్స్ అన్ని ఉంటాయి కదా' అన్నాడు. 'నిజంగా వస్తావా?' అడిగాడు జోసఫ్. 'ప్రామిస్ వస్తాను' అన్నాడు ప్రవీణ్. 'నీ కొరకు మా మమ్మీతో నీకెంతో ఇష్టమైన న్యూడిల్స్ చేయిస్తాను' అన్నాడు జోసఫ్. 'న్యూడిల్స్ యమ్మీ... నేను ఇంటికి వెళ్ళి అమ్మకి చెప్పి వస్తాను' అన్నాడు ప్రవీణ్. సంతోషంగా ఇంటికి వెళ్ళిన జోసఫ్ 'మమ్మీ మమ్మీ ఈ రోజు న్యూడిల్స్ చేయవా ప్లీజ్' అన్నాడు బ్రతిమాలు తున్నట్లుగా. తల్లి సరే అన్నది. జోసఫ్ చకచకా కాళ్ళు చేతులు కడుగుకొని ప్రవీణ్‌కోసం ఎదురు చూడసాగాడు. చీకటి పడ సాగింది. ప్రవీణ్ రాలేదు. జోసఫ్‌కి ప్రవీణ్ మీద కోపం వచ్చింది. మరునాడు స్కూల్‌లో ప్రవీణ్ జోసఫ్‌కి సారీ చెప్పాడు. అయినా జోసఫ్ ప్రవీణ్‌తో మాట్లడలేదు, అతనితో కలిసి లంచ్ చేయలేదు, ఆడుకోలేదు. రెండు రోజులు గడిచాయి. ప్రవీణ్ ఎంత ప్రయ త్నించినా సారీ చెప్పినా జోసఫ్ ప్రవీణ్‌తో మాట్లడలేదు. చివరికి ప్రవీణ్, జోసఫ్ ఇంటికి వచ్చి పార్కులో ఆడుకుందామా అని అడిగాడు. జోసఫ్‌కి ప్రవీణ్‌తో ఆడుకోవాలని ఉంది కాని కోపంగా కూడా ఉంది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఎంతో సమయం నుండి ప్రవీణ్ జోసఫ్‌ను బ్రతిమిలాడటం చూసి తల్లి కలుగజేసుకొని జోసఫ్‌ను దగ్గరకు తీసుకొని, 'ప్రవీణ్ సారీ చెప్తున్నాడు కదా, పాపం బ్రతిమాలుతున్నాడు, అన్ని మర్చిపోయి చక్కగా ఆడుకోండి' అంది. 'సారీ చెప్తే సరిపోతుందా? ఆ రోజు నేనెంత బాధపడ్డానో, ఎంత ఎదురుచూశానో, నేనేమి అడగలేదు తనే వస్తానని ప్రామిస్ చేశాడు, తనే రాలేదు. కంప్లీట్ అన్‌ఫెయిర్' అన్నాడు బుంగ మూతి పెట్టుకొని. 'నువ్వు కూడా ప్రామిస్ బ్రేక్ చేశావుగా మరి నీకేం పనిష్మెంట్ ఇవ్వాలి?' అంది తల్లి. 'నేనేమి ప్రామిస్ బ్రేక్ చెయ్యలేదే' అన్నాడు ప్రశ్నార్థకంగా. 'చూడు జోసఫ్ న్యూఇయర్ రోజు నీకు వచ్చిన వాగ్దానం ఏమిటో గుర్తుందా?' అని అడిగింది తల్లి. నిజానికి జోసఫ్ ఆ వాగ్దానం ఎప్పుడో మర్చిపోయాడు. 'సారీ మమ్మీ గుర్తులేదు' అన్నాడు తల వంచుకొని. 'అంటే నీకు నాతో చేసిన ప్రామిస్ కూడ గుర్తు లేదన్న మాట' అంది. ఏం ప్రామిస్ అని ఆలోచించసాగాడు జోసఫ్. తల్లి జోసఫ్ బైబిల్‌లోని ప్రామిస్ కార్డును తీసి జోసఫ్‌కు ఇస్తూ 'మీకేది ఇష్టమో', అనగానే 'మీకేది ఇష్టమో అడుగుడి

అది మీకు అనుగ్రహింపబడును' అని పూర్తి చేసాడు జోసఫ్. తన వాగ్దానం గుర్తు రాగానే జోసఫ్ కళ్ళు సంతోషంతో మెరిశాయి. 'వెరిగుడ్ మరి నాతో చేసిన ప్రామిస్' అంది తల్లి ప్రశ్నార్థకంగా. వెంటనే తన ఫేవరెట్ సైకిల్, డైలీ జీసస్‌కి ప్రేయర్ చేస్తానని తను తల్లితో చేసిన ప్రామిస్ గుర్తువచ్చి 'సారీ మమ్మీ నేను నీతో చేసిన ప్రామిస్ మర్చిపోయాను' అన్నాడు దీనంగా.

తల్లి జోసఫ్‌ను ముద్దాడి, 'పర్లేదులే అయినా నువ్వు సారీ చెప్పాల్సింది నాకు కాదు దేవునికి. దేవుడు నీకిచ్చిన ప్రామిస్ మర్చిపోయావు. దేవునితో డైలీ మాట్లాడతాను అని చెప్పి దేవుడు నీ కొసం ఎదురుచూస్తుంటే నీవు ఆయన్ని మర్చి పోయావు కాబట్టి నువ్వు దేవున్ని క్షమాపణ అడగాలి' అన్నది. 'దేవుడు నా కోసం వెయిట్ చేశాడా మమ్మీ?' అని అడిగాడు జోసఫ్ అమాయకంగా. 'ప్రవీణ్ వస్తాను అంటే నువ్వు వెయిట్ చేశావు కదా, మరి జీసస్ కూడా అలానే నువ్వు తనతో మాట్లాడటానికి వస్తావనీ డైలీ నీకోసం వెయిట్ చేస్తుంటాడు' అన్నది తల్లి. 'అయితే...' అంటూ ఆగిపోయాడు జోసఫ్. 'అవును, ప్రవీణ్ రాకపోతే నువ్వు బాధపడినట్లే నువ్వు రానందుకు జీసస్ బాధపడ్డాడు. అయితే ఇప్పుడేలా? జీసస్‌కి నా మీద కోపం వచ్చి నాతో మాట్లాడడా?' అని ఏడ్వసాగాడు జోసఫ్. ప్రవీణ్ తన తప్పు తెలుసుకొని నిన్ను క్షమాపణ అడిగాడు, 'నువ్వు కూడా యేసయ్యను క్షమాపణ అడిగితే ఆయన తప్పకుండా క్షమిస్తాడు. అయితే ఇంకెప్పుడు నువ్వు చేసిన ప్రామిస్‌ను మరిచిపోకూడదు. యేసయ్యను బాధపెట్టకూడదు' అన్నది తల్లి. 'నిజంగా యేసయ్య నన్ను క్షమిస్తాడా మమ్మీ?' అడిగాడు జోసఫ్. 'క్షమిస్తాడు ముందు నువ్వు క్షమాపణ అడుగు' అని చెప్పి లోపలికి వెళ్ళింది తల్లి.

జోసఫ్ కళ్ళు మూసుకొని 'యేసయ్య నేను ప్రామిస్ బ్రేక్ చేసి, నిన్ను బాధపెట్టాను నన్ను క్షమించు నువ్వు నాకు బ్రాండెడ్ సైకిలివ్వకున్న పర్లేదు మరెన్నడూ ఇలా చేయను నన్ను క్షమించు యేసయ్య ఆమెన్' అని ప్రార్థన ముగించి, ప్రవీణ్‌వైపు చూసి హృదయపూర్వకంగా నవ్వాడు. 'మమ్మీ నేను ప్రవీణ్ పార్కులో ఆడుకొని వస్తాము' అని చెప్పి ప్రవీణ్ చేయి పట్టుకొని పార్కులోకి పరుగెత్తాడు జోసఫ్. వారిద్దరు వచ్చేసరికి ఘుమఘుమలాడే వేడి వేడి న్యూడిల్స్ ప్లేట్స్ స్వాగతం పలికాయి. ఆ తరువాత యేసయ్యతో మాట్లాడటం ఎప్పుడూ మరువలేదు జోసఫ్.

ఒకరోజు జోసఫ్ తన ఇంటి వరండాలో ప్యాక్‌చేసి ఉన్న ఒక సైకిల్ చూసి ఆశ్చర్యంగా ఆనందంగా కొంత అను మానంతో తల్లి వద్దకు వెళ్ళి 'మమ్మీ మమ్మీ ఆ సైకిల్ ఎవరిది? నాకేనా? డాడీ తెచ్చాడా?' అని అడిగాడు. ఇంతలో జోసఫ్ వాళ్ళ డాడీ అందుకొని 'ఆ సైకిల్ నీకే నాన్న, కానీ అది నేను కొనలేదు. నా స్నేహితుడు వాళ్ళ అబ్బాయి కొరకు కొన్నాడు. వాళ్ళు అమెరికా షిఫ్ట్ అవుతూ ఇది నాకిచ్చి వెళ్ళాడు' అన్నాడు. జోసఫ్ కళ్ళు మెరిశాయి 'ఏ కంపెనీ డాడీ? ఏ కలర్? గేర్ సైకిలేనా? డిస్క్ బ్రేక్స్ ఉన్నాయా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు జోసఫ్. 'నేను చూడలేదు, దా చూద్దాం అంటూ తండ్రీ కొడుకులు అన్‌ప్యాక్ చేయగా అది ఫైర్‌ఫాక్స్ కంపెనీ సైకిల్. అందులోను 21 గేర్ సైకిల్. జోసఫ్ ఆనందంతో కేకలు పెట్టసాగాడు. జోసఫ్ తల్లి వద్దకు వెళ్ళి 'మమ్మీ, మమ్మీ నా కొత్త సైకిల్ చూద్దువురా' అంటూ తీసుకొని వచ్చి సైకిల్ చూపించి సంతోషంతో తల్లిని కౌగిలించుకున్నాడు. తల్లి జోసఫ్‌తో 'వాగ్దానం చేసిన దేవుడు నమ్మదగిన వాడు. నీకిష్టమైనది నీవడిగినది ఇస్తానని వాగ్దానం చేశాడు. ఇచ్చాడు. కాబట్టి యేసయ్యకు థ్యాంక్స్ చెప్పు' అన్నది.

యేసయ్య వాగ్దాన చేసి నెరవేరుస్తాడని జోసఫ్‌కు అర్థమైంది. యేసయ్యకు థ్యాంక్స్ చెప్పి సంతోషంగా సైకిల్ రైడ్‌కి వెళ్ళాడు జోసఫ్.

## పాఠకులకు గమనిక

దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే సంవత్సర చందా ఫోన్ పే, బ్యాంక్ అకౌంట్ ద్వారా కాకుండా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**
**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**
**6వ లైను, కొపేట, ఒంగోలు-523001**
**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

# కృపాదానం

1940లో కృపాదానంగారి భార్య తెనాలి ప్రక్కనున్న పినపాడు గ్రామములో రోమన్ కేథలిక్ మిషన్‌లో టీచర్‌గా పనిచేస్తుండేది. కృపాదానం గారు గ్రామంలో సేవ పరిచర్య చేస్తుండేవారు. కృపాదానం గారి ముగ్గురు బావమర్దులు తమ బావకి ఏమి పని లేదు, పనిచెయ్యటం లేదు అనుకునే వారు. ఒకరోజు రేపల్లె నుండి ఒక రిటైర్డు స్కూల్ టీచర్‌గారు కృపాదానం గారింటికి వచ్చి తెనాలిలో ఒక ఇంట్లో ముగ్గురు హైస్కూలు పిల్లలు ఉన్నారు. వారికి ట్యూషన్ చెబుతారా? అని అడిగాడు. నేను ఇప్పుడు చేస్తున్న పని ఎలా? అన్నాడు. మీరు చేస్తున్న దానిని పని అంటారా? అన్నాడు. ఇది కోతవాని పని అన్నాడు. అయితే ఏదైనా ఒక మిషనరీలో చేరి పనిచెయ్యాలి కదా! అన్నాడు. అంటే ఏమిటి? అన్నాడు కృపాదానం. మీకు పిలుపు ఉండాలి. ప్రభువు సేవ కొరకు మీకు ఖచ్చితమైన పిలుపు ఉన్నదా? అన్నాడు. మానవులంద రికి దేవుని పిలుపు ఉన్నది. ఆయన ఈ లోకములో మానవావతారములో ఉన్నప్పుడే ఆ పిలుపు ఇచ్చాడు. కోతపనివారిని పంపుటకు కోత యజమానిని ప్రార్థించమ న్నారు. ఇప్పుడు ఈ దేశములో ఉన్న నామకార్థ క్రైస్తవులంద రు దేవుని సేవకు వచ్చినా సరిపోరు కదా అన్నాడు. మీ పిల్లలను సేవకు పంపరా? అని పాస్టర్లను అడిగితే వానికి ష్టమయితే మాకు అభ్యంతరము లేదు అంటారు. పని పాట లేనివారు చదువు సంధ్య లేనివారు కూడా పాదిరిలుగా తయారై అక్కడక్కడ అడుక్కొని తిని బలిసి, తమ పిల్లలు కూడా తమలాగా అడుక్కోవడం ఇష్టం లేక సేవకు పంప డానికి ఇష్టపడరు అనుకుంటా అన్నాడు. ఆ పాస్టరుగారు కొంచెం బాధపడ్డారు. పాస్టరుకు ఇచ్చే చందా కూడా అడుక్కోవటమా? అన్నాడు. కాదు కాని, నీ హృదయ ములో ని ఆలోచనలు దేవుడెరుగును. మన యజమాని అంటే దేవుని వలన పోషించబడితే, అటువంటి విశ్వాస జీవితం లోనికి వస్తే ఇప్పుడున్న పాదిరిలను ఇతరులకు ఇచ్చే వాళ్ళుగా మారుస్తాడు దేవుడు. అది క్రియా రూపముగా అనుభవించిన వారు మాత్రమే, కోత యజమానిని హృదయ పూర్వకముగా నమ్మినవారు మాత్రమే తల ఎత్తుకొని ధైర్యం గా తిరుగుతారు అన్నాడు.

1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత బొంబాయి దగ్గర దేవలాలి కంటోన్మెంటు నుండి పదవీ విరమణ చేసి ఒంగోలుకు వచ్చారు. 1947లో సామర్లకోట రైల్వేస్టేషన్ హిగ్గిన్‌బాతమ్‌ను ఒక సంవత్సరం నడిపించిన తర్వాత తన భార్యకు తూర్పు గోదావరిలోని తుని రైల్వేస్టేషన్ నుండి 11 మైళ్ళు దూరములో ఉన్న కోటనందూరుకు మూడు మైళ్ళ దూరంలో ఉన్న భీమవరపు కోట గ్రామములో కాపురం పెట్టాడు. ఆ గ్రామములో ఒక దివాణం ఉండేది (మా దృష్టిలో అది రాజగృహము). చుట్టు పెద్దగోడ కోటగోడవలె ఉండేది. లోపల మనుష్యులు ఎప్పుడు బయట కనబడలేదు. లోపల చూస్తే పనివారు మాత్రం బయటకు వచ్చి పోతుండేవారు. మంచి నీళ్ళు కోసం ఒక మైలు వెళ్ళి చెరువు నీరు తీసుకొని రావాలి. ఆ చెరువు నీరు ఎర్రగా ఉండేవి. ఒక బిందె నీరు తీసుకొని వస్తూ కోమిటి కొట్టులో చిల్లగింజలు కొనుక్కొని రావాలి. ఒక గింజను కుండలోపల గోడలకి అరగదీస్తే నీళ్ళు విరిగిపోయి రక్తం లాంటి రంగున్న నీళ్ళు పాలవలె మారి మట్టి అడుగుకు చేరుతుంది. 1948లో కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉన్నది. మేము నివాసమున్న పశువుల పాక తలుపు లేనిది. నాలుగు గజాల ఎత్తు కొండమీద పెద్ద బండల నడుమ కట్టబడింది. రిజర్వు పోలీసులు తెల్లవారకముందే గ్రామాన్ని దివాణాన్ని కూడా చుట్టు ముట్టారు. కృపాదానంగారిని నలుగురు రిజర్వు పోలీసులు దివాణం వంటి ఇంటికి తీసుకొని వెళ్ళి కమ్యూనిస్టు లీడర్లు ఎక్కడ దాగి ఉన్నారో చెప్పమంటున్నారు. గ్రామాలలో సాదాసీదా మగవారిని లైనుగా నడిపిస్తూ వారు దగ్గరకు వచ్చినప్పుడు లాఠీలతో దెబ్బలు గట్టిగా కొట్టి ఆరాతీస్తున్నారు. ఒంగోలు నుండి తుని ప్రాంతానికి ఎందుకు వచ్చావు? అని అడిగారు. నా భార్యకు ఇక్కడ టీచరు ఉద్యోగం అన్నాడు. బడి పంతులుకి

అప్పుడు 45 రూ. నెలకి. అంత తక్కువ జీతం ఉన్న ఈ ఉద్యోగం కొరకు ఇంత దూరం వచ్చావా? అన్నది వారి వాదన. రెండవది మీరు మీ కులం చెప్పరు. కులం అడిగితే ఇంటిపేరు ఎందుకు చెప్తారు? అన్నారు. నా కులం నన్ను పెద్దకులస్తుల ఇండ్లలోనికి వెళ్ళనివ్వదు కనుక నా ఇంటిపేరు కొడవటి కంటి, నా భార్య ఇంటి పేరు కూచిపూడి రెండు అగ్రవర్ణాల వారి ఇంటిపేర్లు కనుక నేను కూడా మతం తీసుకున్న అగ్రకులస్తుడు అనుకుంటారు అని అన్నాడు. వాళ్ళు కమ్యూనిస్టులో నీ బంధువు కాని, స్నేహితులు కాని ఉన్నారా? అని అడిగారు. నేను క్రైస్తవుడిని, యేసుభక్తుడిని, యేసుప్రభువు యధార్థమైన కమ్యూనిస్టు. అందువలన నేను కమ్యూనిస్టు అభిమానినే కాని, రాజకీయ విషయాలలో కాము. నిన్నువలె నీ పొరుగువాని ప్రేమించుమని చెప్పినదే... యేసు అన్నాడు. ఈ సంఘటన తర్వాత కృపాదానంగారి కులం ఏమిటో తెలిసిపోయింది. అయినా ప్రజలలో ఆయనకు చాలా గౌరవం పెరిగిపోయింది. స్నేహితులు ఎక్కువయ్యారు. సంవత్సరం తర్వాత కృపాదానం గారు ఇల్లు ఖాళీ చేసి సామర్లకోటకు బయలు దేరినప్పుడు,మాకు తన పశువులశాలను బాగుచేసి అద్దె లేకుండా నివాసమును ఇచ్చిన అప్పలస్వామి నాయుడుగారు యేసుప్రభువును నమ్ముకున్నారు.ఆ రోజుల్లో ఒక రాత్రి మాదిగపల్లె అంతా కాలిపోయినప్పుడు కృపాదానంగారు గవర్నమెంటు ద్వారా సదుపాయములు అన్నీ తెప్పించారు.

1948 ఫిబ్రవరిలో భీమవరపుకోట నుండి సామర్లకోట వచ్చిన కృపాదానం బాప్టిస్టు, లూథరన్ చర్చిలకి మధ్యలో, ఎత్తైన పీఠభూమి మీద మట్టి గోడ ప్రహరీగా ఉన్న ఇంట్లో చేరాడు. ఆ ఇంటికి ఎదురుగా ముస్లింల సమాధులు, వెనుక హిందూ దేవాలయం ఉండేవి. కొంత కాలానికి తమ ఇంటికి కొంచెం దూరంలో ఉన్న మార్తమ్మ అనే పెంతెకోస్తు స్త్రీతో సహవాసం కలిగింది. అందువలన కృపాదానం హన్నమ్మలు కొంతకాలం పెంతెకోస్తు సహవాసంలో ఉన్నారు. అయితే భాషలు మాట్లాడలేదు. మాట్లాడాలి అనుకోలేదు.

**(సశేషం)**


## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 50/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 45/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్ | రూ. 50/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 50/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. 60/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 40/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 40/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |

### సండేస్కూల్ గేమ్స్

| | |
|---|---|
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 350/- |
| ఫ్రూట్స్ ఆఫ్ స్పిరిట్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ట్యాబర్‌నికల్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ఈజిప్ట్ టు కానాన్ జర్నీ బోర్డ్ గేమ్ | రూ. 350/- |

**బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను,
ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,
ఫోన్ : 9440217726

# యెహోవా అందరికి ఉపకారి

ఉపకారం చేయటమంటే ఇతరులకు సహాయపడటం. "నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమించు" అన్న యేసుక్రీస్తు మాటలోని గూఢార్థం ఇతరులకు ఉపకారిగా ఉండమనటమే. మనుష్యులలో స్వార్థం ఉన్నంత కాలం ఇతరులకు ఉపకారం చేయలేరు. దేవున్ని విశ్వసించని వారు ఇతరులకు నిస్వార్థంగా ఉపకారం చేయలేరు. ఒకవేళ ఎవరైనా ఇతరులకు సహాయ పడాలంటే వారి నుండి ఏదైనా ఆశిస్తేనే తప్ప ఇతరులకు సహాయపడరు. మనుష్యులైతే తమ్మును ప్రేమించిన వారినే ప్రేమిస్తారు. తమ్మును ద్వేషించే వారిని, తమకు సహాయపడని వారిని ప్రేమించలేరు. దేవుడొక్కడే మానవుల నుండి ఏదీ ఆశించకుండా ఉపకారం చేస్తాడు. మంచివారి మీద, చెడ్డవారి మీద వాన కురిపించినట్లే ఉంటుంది దేవుని ప్రేమ. అయితే దేవుని ప్రేమ ఎవరిలోనైతే ఉంటుందో వారు ఎవరినైనా ప్రేమిస్తారు, వారికి ఉపకారం చేస్తారు. దానికి చక్కని ఉదాహరణ 'మంచి సమరయుడు'. తనకు సంబంధంలేని వ్యక్తిని అక్కున చేర్చుకొని ఉపకారం చేశాడు. ఉపకారము చేసే ముందు లాభనష్టాలు బేరీజు వేసుకోలేదు. తను వెళ్తున్న పనికి ఆలస్యంగా వెళ్తాడేమో అని ఆలోచించలేదు. తన దగ్గరున్న డబ్బు ఖర్చు చేసేటప్పుడు తన అవసరాలను గురించి పట్టించుకోలేదు. పైగా ఇంకేమైనా ఖర్చు పెట్టాల్సివస్తే భరించడానికి సిద్ధపడ్డాడు. ఎవరో తనకు సంబంధంలేని, ముక్కూముఖం తెలియని వ్యక్తిపట్ల అంతగా జాలిపడటం అంటే ఆ హృదయంలో దేవుడు అన్న భావన వుంటే తప్ప సాధ్యం కాదు. ఆ సమరయునికున్న జాలిపడే గుణం ఇతరులకు ఉపకారం చేసేలా చేసింది. దేవుని సహజ స్వభావం జాలిపడటం. ఈ జాలిపడే హృదయం ఎవరికైతే ఉంటుందో వారు ఇతరులకు సహాయపడతారు. ఈ స్వభావం, దేవుని ప్రేమించే వారికి వస్తుంది. ఎలాగైతే దేవుడు జాతి, మత, కుల, వర్ణ వర్గ బేధము లేకుండా అందరికీ ఉపకారం చేస్తాడో అలాగే మనం కూడా మన పొరుగు వారిని ప్రేమించాలి. దేవుడు అందరికి ఉపకారియైయున్నట్లు మనము కూడా అందరిని ప్రేమించి ఉపకారము చేయాలని దేవుడు కోరుకుంటున్నాడు. *'మీరైతే ఎట్టి వారిని గూర్చియైనను నిరాశ చేసికొనక మీ శత్రువులను ప్రేమించుడి, మేలుచేయుడి, అప్పు ఇయ్యుడి; అప్పుడు మీ ఫలము గొప్పదై యుండును, మీరు సర్వోన్నతుని కుమారులై యుందురు. ఆయన, కృతజ్ఞతలేని వారి యెడలను, దుష్టుల యెడలను ఉపకారియై యున్నాడు' (లూకా 6:35).* మన శత్రువులను ప్రేమించడం, వారికి మేలు చేయడం, అప్పు ఇవ్వడం ఇవన్నీ సాధ్యమైనవేనా? శత్రువులను ప్రేమించి మేలు చేయకపోయినా, కనీసం ద్వేషించి కీడు చేయకుండా ఉండగలిగితే కొంత వరకు మేలు చేసిన వారమవుతాము. కృతజ్ఞత లేనివారి యెడల, దుష్టుల యెడల దేవుడు ఉపకారియై ఉన్నట్లు మనము కూడా ఉండటానికి ప్రయత్నిస్తే దేవుడు మనకు తప్పక సహాయ పడతాడు. దేవుడు మననుండి కోరుకొనేది అదే. మనం ఇతరులకు ఉపకారం చేసే దేవుడు మనకు ప్రత్యుపకారం చేస్తాడు. *'బీదలను కనికరించువాడు యెహోవాకు అప్పిచ్చు వాడు, వాని ఉపకారమునకు ఆయన ప్రత్యుపకారము చేయును' (సామెతలు 19:17).* నీవు దేవున్ని ప్రేమిస్తున్నావో లేదో ఇతరులపట్ల నీ హృదయ స్పందన తెలియజేస్తుంది.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... www.onlinetelugubible.net**

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

**....రెండు కాసులు** అందులో వేయుచుండగా చూచి – ఈమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెను. ఆ బీద విధవరాలు కలిగి వున్నది – లేమి. అందుకే తనకు కలిగిన లేమిలో నుండి... అన్నాడు ప్రభువు. ఇచ్చే హృదయం ఉన్నవారికి లేమి అనేది లేదు. ఇచ్చే హృదయం ఎంత కలిగివున్నను, లేనివాడు లేమి కలిగినవాడు. ఈమె ఇవ్వడానికి ఇంటి యొద్ద నుండి బయలుదేరింది. స్త్రీలు యెరూషలేము దేవాలయములోనికి వెళ్ళకూడదు. స్త్రీల కొరకైన అంటే స్త్రీలు వారికి కేటాయించిన స్థలములోనే ఉండి దేవుని ఆరాధించాలి. కానుకల పెట్టె వారి ఆరాధనా స్థలములోనే ఉంటుంది. ఈమె తనకు కలిగినదంతా అంటే ఆ రోజున ఆమెకు కలిగినది అంతా తీసుకొని వచ్చి చందా పెట్టెలో వేసింది. అలా దేవునికి ఇవ్వడం వలన కలిగే ప్రతిఫలం ఇప్పుడు ఈ జన్మలో ఇక్కడ ఈ భూమి మీదనే ఇవ్వబడుతుంది.నాకు తెలిసిన ఒక సువార్తికుడు ఎప్పుడు ఇతరులకు ఇస్తూ ఉంటాడు. మనియార్డర్లు చేస్తుంటాడు. నీకు వాళ్ళు ఏమవుతారు? అని అడిగాను. ఏమీకారు అన్నాడు. అయితే ఎందుకు ఇస్తున్నావు? అని అడిగితే అది ప్రేరేపణ అన్నాడు. నాకు అలా ప్రేరేపణ కలిగినపుడు ఇవ్వకపోతే నా హృదయంలో సంతోషము ఉండదు. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే అలా దేవుని పేరుమీద ఇవ్వడం నేను అలవాటు చేసుకొనిన తర్వాత నేను సమృద్ధిలోకి వచ్చాను అన్నాడు.

దేవుడు మాట తప్పనివాడు. నిన్నడుగు ప్రతివానికిమ్ము లూకా 6:30. నిన్ను అప్పుడుగగోరు వాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు మత్తయి 5:42

ఈ మాట క్రొత్తలో కొంత ఆశ్చర్యం కలిగించింది. కాని దీనిని ఆచరణలో పెట్టినపుడు అది తేలికగాను దీవెనకరముగాను ఉండినది. మనలను అడిగేవ్యక్తి, మంచి వాడు కాకపోవచ్చు. మన లెక్కలో అతను మంచివాడు కాకపోవచ్చు. కాని ప్రభువే అతనిని మన దగ్గరికి పంపించి యుండవచ్చునుకదా! మనకు ఇవాళ అంతకు వందరెట్లు ఇవ్వగలిగిన దేవుడు మన నోటి దగ్గరది తీసి ఇతరులకిమ్మని అనడు. అన్నాడంటే – నువ్వు అతనికివ్వు, నీకిచ్చేవాడిని నేను కదా అంటున్నాడు. ఇది ప్రాక్టికల్గా నిరూపించ బడినది. అలాగే నిన్ను అప్పు అడుగగోరు వానినుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు. అయ్యో ప్రభువా! అతడు మళ్ళీ తిరిగి ఇవ్వడయ్యా అంటే నీకెందుకు? నీకియ్యగలిగింది నువ్వు ఇవ్వు. నీకిచ్చే వాడిని నేను అంటున్నాడు మన ప్రభువు. ప్రభువు పేరిట మనం ఇచ్చే స్థితి – మనకు ఇప్పుడిచ్చినది కాక, ఇంకా చాలా ఇవ్వాలని కోరుకుంటు న్నాడన్నమాట. ఇవన్నీ మనం చేసి ఫలితాలు పొందినపుడు మనం దేవుని ప్రేమను రోజు రుచి చూడగలము.

మనం ఏ పనిచేసినా మన జ్ఞానముతో కాక మన జీవితంలో దేవుని ప్రమేయము లేని సమయము సంఘటన ఉండటానికి వీలులేదు. అదే విధంగా మనకు ఇవ్వబడిన డబ్బు – మన చేతిలో ప్రతినెల ఏదో విధంగా మనం ఖర్చు చేసే డబ్బును మనం వాడేటప్పుడు విశ్వాసము వినియో గించి వాడాలి. అంటే ఈ డబ్బును వీరు అడుగుతున్నారు. వారికే ఇస్తే ఈనెల నాకు సరిపోదు. వీరు అప్పు అడుగుతు న్నారు వీరికి ఇస్తే నా డబ్బులు అయిపోతాయి అని ఆలోచిస్తారు. అది యదార్థము కూడా! ఏ స్థాయిలో వారికి – వారి స్థాయికి తగ్గ ఖర్చులు ఉంటాయి. ఇక్కడ మనం దేవుడు చెప్పినట్లుగా డబ్బును వాడాలి. అంటే అనుకోకుం డానో అవసరము వస్తే కాని దేవుని పేరుమీద ఎవరికైనా ఇచ్చినా ఖర్చుచేసినా విశ్వాసంతో అంటే దేవుడు చూస్తున్నాడు – ఆయన చిత్తానుసారంగా నేను నా వనరు లను ఖర్చు చేసినప్పుడు ఆ లోటును తీర్చేవాడు ప్రభువే! అని దేవుని మీద విశ్వాసంతో చెయ్యాలి.

**...మిమ్మును పిలిచిన దేవుడు నమ్మదగినవాడు.**

# లోకంతీరు

**(పుట్టుక చావు మధ్య సంబరం)**

భూమి మీద పుట్టిన ఏ మనిషి తన పుట్టుక గురించి కాని, తన చావు గురించి కాని ఎక్కువగా ఆలోచించడు. చావు అంటే భయంతో అప్పుడప్పుడన్నా చావు గురించి ఆలోచిస్తా రేమోగాని, పుట్టుక గురించి ఆలోచించేవారు చాలా అరుదు. పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకుంటారు కాని, తన పుట్టుక గురించి లోతుగా ఆలోచించరు. అద్దంలో తన ముఖాన్ని చూసి తన అందానికి మురిసి పోతుంటారు కాని, తన శరీర నిర్మాణాన్ని గురించి ఎవరూ ఆలోచించరు. క్రింది వచనాన్ని మనం పరిశీలనాత్మకంగా చూస్తే దావీదు మహారాజు తన పుట్టుక గురించి ఎంతో లోతుగా పరిశీలించినట్లు గమనించ గలం. "*నా అంతరింద్రియములను నీవే కలుగ జేసితివి, నా తల్లి గర్భమందు నన్ను నిర్మించి నవాడవు నీవే*" అని తన పుట్టుకకు కారణం దేవుడే అంటున్నాడు. ఈ శరీరం యొక్క నిర్మాణాన్ని గురించి, అంతరింద్రియములను గురించి ఆలోచించాడు దావీదు. ఆయన గొప్ప మహారాజు. అంతటి గొప్ప రాజు గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించి, విలాసవంతమైన జీవితం జీవిస్తూ, తన భార్యలతో సుఖసంతోషాలతో మునిగి తేలుతూ ఉండాలి కాని, ఇలా తన పుట్టుక గురిం చి, తన శరీరంలోని అంతరింద్రియాలను గురించి ఆలోచించట మేంటి? ఆయనకు అంత అవసరం ఏమోచ్చింది?

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

మీరెప్పుడైనా మీ జీవితకాలంలో ఒక్కసారైనా మీ పుట్టుక గురించి సీరియస్‌గా ఆలోచించారా? మీ శరీర నిర్మాణము గురించి ఆలోచించారా? దావీదు చెప్పినట్లు "*నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును ఆశ్చర్యమును పుట్టుచున్నవి, అందునుబట్టి నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను*" అన్నట్లు మీరు ఎప్పుడైనా భావించారా? ఒకవేళ మీరు మీ శరీర నిర్మాణం గురించి తెలుసుకో గలిగితే నిజంగానే మీరు దావీదువలె దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తారు. ప్రతి ఒక్కరూ వాళ్ళు పుట్టిన రోజు నుండే తేది లెక్కిస్తారు. కాని వాళ్ళు వారి తల్లి గర్భమందు ఎప్పుడు ప్రవేశ పెట్టినది ఎవ్వరికీ తెలియదు. అది రహస్యం. అందుకే దావీదు "*నేను రహస్యమందు పుట్టిననాడు*" అని అన్నాడు. అంటే మన పుట్టుక రహస్యం. అది దేవునికే తెలుస్తుంది తప్ప, మనల్ని కన్న మన తల్లిదండ్రులకి డాక్టర్లకి కూడా తెలియదు.

కంటికి కనబడనంత చిన్న కణం రూపంతో మనం తల్లి గర్భంలోకి ప్రవేశిస్తాము. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, మనతో పాటు తల్లి గర్భంలోకి ప్రవేశించడానికి కొన్ని కోట్ల కణాలు పోటీ పడతాయి. తల్లి గర్భంలోకి ప్రవేశించక ముందు మన రూపం ఇలా ఉంటుంది. మైక్రోస్కోపులో చూస్తే తప్ప మామూలు కంటికి ఇవి కనబడవు. తల, తోక అన్నట్లు కనిపిస్తుంది ఈ కణము. ఇలాంటివి కొన్ని కోట్ల కణాలు తండ్రి నుండి విడుదల కాబడినప్పుడు, అవి తల్లి అండము లోనికి



ప్రవేశించడానికి పోటీపడతాయి. అయితే తల్లి అండం ఒక్క కణానికి మాత్రమే అవకాశం ఇస్తుంది. కొన్ని సందర్భాల్లో రెండు కణాలు కూడా వెళ్తాయి. ఆ కణాలే కవలలుగా రూపుదిద్దుకుంటాయి. మిగిలిన కణాలన్నీ చని పోతాయి. కణాలు అంటే మనలాగా మనుషులుగా పుట్టాల్సి నవే.

అయితే దేవుడు తన కృపనుబట్టి, తన చిత్తాన్నిబట్టి మనకు మాత్రమే తల్లి గర్భములోనికి ప్రవేశించే ఆవకాశం ఇచ్చాడు. గర్భఫలము దేవుడిచ్చు బహుమానమైతే, నువ్వు నేను దేవుని యొక్క బహుమానాలు అని మనం గ్రహించాలి.

ఇలా తల్లి గర్భంలోకి ప్రవేశించిన ఆ ఒక్క కణం, కణ విభజన ద్వారా అంటే ఒక్క కణం రెండుగా, రెండు నాలుగుగా, నాలుగు ఎనిమిదిగా, ఎనిమిది పదహారుగా విభజించు కుంటూ పిండముగా రూపుదిద్దుకుంటుంది. అలా రుపుదిద్దు కున్న పిండము తొమ్మిది నెలల వరకు అవయవా లను సంతరించుకుంటూ మనిషిగా భూమ్మీదకు వస్తుంది.




కొన్ని కోట్ల కణాల త్యాగ ఫలితమే ఈ మనిషి జన్మ. చాలామంది మనుష్యులు దేవుడిచ్చిన ఈ మనిషి జన్మకి ఉన్న విలువ తెలీక 'నేను ఎందుకు పుట్టానురా బాబూ, పుట్టకపోయినా బాగుండు' అని అనాలోచితంగా మాట్లాడ తారు. మనతో పాటు ప్రవేశపెట్టబడిన ఎన్నో కోట్లమంది మనుష్యులని కాదని మనకి మాత్రమే అవకాశం ఇచ్చి ఈ భూమి మీదకి తీసుకొచ్చిన దేవుని యొక్క చిత్తాన్ని గ్రహించ లేనివాళ్ళు మాత్రమే అలా మాట్లాడతారు. కొన్ని కోట్లమందిని (కణాలను) కాదని నిన్ను, నన్ను మాత్రమే ఈ భూమి మీదకి తీసుకురావడానికి దేవునికి మన పట్ల ఎలాంటి ప్రణాళిక లేకుండానే ఉంటుందా? ఈ భూమ్మీద సుఖసంతోషాలు అనుభవించి, ఈ లోకానుసారమైన జీవితం జీవించటానికే మనకి పుట్టుకను ఇచ్చాడా?

రహస్యమందు మనం తల్లి గర్భములోనికి ప్రవేశింప బడినది మొదలు భూమ్మీదకు వచ్చే వరకు అనగా తొమ్మిది నెలల కాలంలో తల్లి గర్భంలోనికి ప్రవేశపెట్టబడిన కంటికి కనిపించని కణము, ఆకారం రూపుదిద్దుకొని, ఎముకలుగా, మాంసంగా, రక్తంగా, గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, కళ్ళు, ముక్కు, చెవులు, నోరు ఇలా శరీరభాగాలుగా మారి ఒక రూపాన్ని సంతరించుకుంటుంది. ఇదంతా ఒక అద్భుతమైన ప్రక్రియ. మన శరీర నిర్మాణం గురించి, శరీరంలోని భాగాలు ఎలా పనిచేస్తాయో తెలిస్తే ఇంతటి గొప్ప నిర్మాణాన్ని మనకు కలుగజేసినందుకు దావీదులా మనం కూడా దేవున్ని స్తుతించకుండా ఉండలేము.

దేవుడు కలుగజేసిన అంతరింద్రియాలన్నీ విలువైనవే. ఒక కిడ్నీ కాని, గుండె కానీ, కాలేయం, రక్తము ఇవన్నీ బహిరంగ మార్కెట్లో కొనాలంటే లక్షల రూపాయలు వెచ్చిం చాలి. ధనవంతులు తమ ప్రాణాలను కాపాడుకోటానికి ఎంత డబ్బు అయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉంటారు. అయితే ప్రతి మనిషికి వీటన్నిటిని దేవుడు ఉచితంగా ఇచ్చాడు. "నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి" అని దావీదు దేవునితో అంటున్నాడు.

మనం ఉదయం నిద్రలేచిన దగ్గర్నుండి మళ్ళీ రాత్రి పడుకోబోయే వరకు, నిద్రపోయేటప్పుడు కూడా మన శరీర బాగాలు పని చేస్తూనే ఉంటాయి. మనం చనిపోయే వరకు గుండె కొట్టుకుంటూనే ఉంటుంది, రక్తప్రసరణ జరుగుతూనే ఉంటుంది, మెదడు, శరీర భాగాలన్నీ పనిచేస్తూనే వుంటాయి. వాటికి రెస్టు వుండదు. అవన్నీ నిరంతరం పని చేస్తుంటాయి కాబట్టే మనం హాయిగా నిద్రపోగ లుగుతున్నాం. ఏ ఒక్క శరీర అవయవం సరిగ్గా పనిచేయక పోయినా మనకి నిద్ర పట్టదు. దేవుడు మనకు ఆరోగ్యమిచ్చి, మనల్ని హాయిగా నిద్రపోయేలా చేస్తున్నాడు. ఈ విషయం ఎంతమంది అర్థం చేసుకోగలుగుతున్నారు. ఒకవేళ నిజంగా ఎవరైనా ఈ విషయాలన్నీ ఆలోచించ గలిగితే, దేవునిపట్ల కృతజ్ఞత కలిగి, విరిగి నలిగిఋున హృదయం కలిగి వుంటారు కదా! కానీ, ఎవరు ఆలోచిస్తారు ఇవన్నీ? **(ఇంకా వుంది)**



# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 6

**అడ్డం :**

1. తారుమారైన బాబెలు అర్థం (4)
4. ప్రార్థించుటకు యేసు శిష్యుల నుండి వెళ్ళిన దూరం(4)
7. యిర్మీయా ప్రవచనం: -- లో అంగలార్పు వినబడెను (2)
8. తిరగబడిన ఇమ్ము ఇమ్ము అను కూతుర్లు గల జీవి (3)
9. యేసు శపించిన అంజూరపు చెట్టు ఎండి -- అయ్యింది (2) (అటు నుండి)
10. తిరగబడిన ఆభరణాలు (3)
12. యేసు శిష్యుల పాదములు ---టకును... మొదలుపెట్టెను (3) (అటు నుండి)
17. చిందరవందరైన బైబిల్లోని అతి చిన్న వాక్యము (9)
18. దినకరన్ గారి పాట "--- వలదు మనసా"(3)
20. యేసును చంపుటకు ఆలోచన చెప్పిన వాడు (3)
22. హేరోదు వధించిన పిల్లలు మగ? ఆడ?(2) (అటు నుండి)
23. నేను ఓర్చి యోర్చి --- (3)యున్నాను యిర్మీ. (అటు నుండి)
24. -- హత్య చేయకూడదు (2)
26. నమ్మినవారనేకులు ప్రభువు తట్టు ---- (4) అపొ.కా
27. రాజైన ---- మాటలు, అతని తల్లి అతనికుపదేశించిన దేవోక్తి (4) (సామెతలు) (తారుమారు)

**నిలువు :**

1. నయోమి అనకుండా -- అనుడి. (2)
2. యేసు సమాధిలో పేతురు చూచిన వస్త్రం (3)
3. నీతి తప్పి తన ---ను స్థాపించువానికి శ్రమ (3) (తలక్రిందులుగా) యిర్మీయా
4. దానియేలు గ్రంథములోని అధ్యాయాలు చాలావరకు ఈ పదంతో ప్రారంభమౌతాయి (3)
5. మేము లోక... మనుష్యులకును---గా ఉన్నాము(3) (1కొరింథీ)
6. ఏ గంపలనెత్తకుండ వారి చేతులు విడుదల పొందెను (2) కీర్తనలు (క్రింద నుండి పైకి)
11. ఈ పిట్టను పట్టుకుంటే చేయి తెగుతుంది జాగ్రత్త దాని పేరు-----(5) (తారుమారు) (యెషయా)
13. ఆత్మను, దేహమును కూడ నరకములో నశింప జేయగల వానికి మిక్కిలి----- (5) (తారుమారు)
14. యాకోబు కల గనిన స్థలమును పరలోకపు --- అనుకొనెను (3)
15. సముద్రతీరమందలి --- వలె నీ సంతానమును విస్తరింపజేసెదను (3)
16. ధనవంతుడు తన ప్రాణముతో --- (3) త్రాగుము, సంతోషించుము...
18. చీమలను చూచి జ్ఞానము తెచ్చుకోవాల్సినవాడు ---(3)
19. మనకు తగని మాటలు (3) (ఎఫెసీ)
20. పుస్తకము అను అర్థమిచ్చు పదము(3) (కీర్తన)
21. చేనిలో --- కట్టుచుండిరి (3). యోసేపు కల
22. విమర్శ దినమందు సొదొమ దేశపు వారి --- ఓర్వతగినదై యుండును (2)
25. కొండగడ్డి--బడియున్నది (2) (తలక్రిందులుగా)